
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
3
పార్వతీపురం మన్యం
జిల్లా వార్తలు
మంగళవారం 21 మే 2024



పూర్తిస్థాయిలో అందేనా?



- ఖరీఫ్‌నకు రైతులు సన్నద్ధం
- నారుమళ్ల తయారీలో నిమగ్నం
- వరి విత్తనాలపై ఆందోళన
- గతేడాది అరకొరగా సరఫరా చేసిన సర్కారు
- ఈ ఏడాది పరిస్థితేమిటో..
- నిబంధనలు సడలించేనా..?

(గరుగుబిల్లి)

జిల్లాలో అడపాదడపా వర్షాలు కురుస్తున్నాయి. వాతావరణం అనుకూలించడంతో రైతన్నలు ఖరీఫ్‌కు సన్నద్ధమవుతున్నారు. ఈ మేరకు ముందస్తుగా వరి నారుమడులను సిద్ధం చేసుకుంటున్నారు. జూన్ మొదటి వారంలో నారు పోసేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకుంటున్నారు. అయితే పూర్తిస్థాయిలో విత్తనాలు అందుతాయో.. లేదోనని ఆందోళన చెందుతున్నారు. గతేడాది ఖరీఫ్‌లో విత్తనాల పంపిణీకి వైసీపీ సర్కారు పలు నిబంధనలు విధించింది. దీంతో ఎంతోమంది రైతులు బయట మార్కెట్లో అధిక ధరలకు విత్తనాలు కొనుగోలు చేసుకోవాల్సి వచ్చింది. ఈ ఏడాది కూడా అదే పరిస్థితి ఎదురవుతుందేమోనని అన్నదాతలు మథనపడుతున్నారు.

గతేడాది పంపిణీ ఇలా..

- గతేడాది రైతుభరోసా కేంద్రాల నుంచి తక్కువగానే 1064 రకం, ఆర్‌జీఎల్, స్వర్ణ రకాలు సరఫరా చేశారు. కాగా రైతులు అధికంగా 1064 రకంపైనే ఆధారపడి ఉన్నారు.
- గతంలో 1001 రకం ఉండేది. అయితే ప్రభుత్వం 1001 రకాన్ని నిలుపుదల చేసి 1064 రకం విత్తనాన్ని ముందుకు తెచ్చింది. మిల్లర్లకు ఈ రకం అనుకూలంగా ఉంటుందన్న దృష్టిలో సరఫరా చేశారు.
- అయితే 1064 రకం కూడా అరకొరగానే సరఫరా చేశారు.
- కాలువల పరిధిలోని రైతులు ఆర్‌జీఎల్, సాంబమసూరీ, స్వర్ణ రకాలు సాగు చేశారు. మొత్తంగా రైతులకు అవసరమయ్యే వరి రకాలను అందించడంలో వైసీపీ సర్కారు పూర్తిగా విఫలమైంది.
- ఈ ఏడాది అయినా పూర్తిస్థాయిలో విత్తనాలు అందించకుంటే రైతులకు ఇబ్బందులు తప్పవు. కౌలు రైతుల పరిస్థితి మరింత దారుణంగా మారనుంది.
- మూడు నుంచి ఐదెకరాలు దాటిన వారికి బస్తా రూ.600 చొప్పున మూడు బస్తాల విత్తనాలే రాయితీపై ఇస్తుండడంతో .. ఆయా రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒక్కో బస్తాకు రూ.1700 చొప్పున చెల్లించి బయట మార్కెట్లో కొనుగోలు చేసుకోవాల్సి వస్తోంది.
- నిబంధనలను సడలించి ఈ ఖరీఫ్‌కు పూర్తిస్థాయిలో విత్తనాల అందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు.

విత్తనాలు అందిస్తాం..

ఖరీఫ్ రైతులకు అవసరమైన వరి విత్తనాలను ఆర్బీకేల్లో అందిస్తాం. ఇప్పటికే 26,416 క్వింటాళ్ల విత్తనాలకు ప్రతిపాదనలు చేశాం. 50 శాతం రాయితీపై సాధారణ రైతులకు 17,424 క్వింటాళ్లు, గిరిజన ప్రాంతాల్లో 90 శాతం రాయితీపై 8,992 క్వింటాళ్లను అందిస్తాం. ఖరీఫ్ ముందు పచ్చిరొట్ట ఎరువులను రాయితీపై అందించనున్నాం.

- కె.రాబర్ట్‌పాల్, జిల్లా వ్యవసాయాధికారి

ఇదీ పరిస్థితి..



జిల్లాలోని 15 మండలాల్లో గతేడాది 2,91,789.20 ఎకరాల్లో వరి సాగు చేపట్టారు. అయితే ఇందులో రాయితీపై విత్తనాలు పొందిన వారు అతి తక్కువ మందేనని చెప్పొచ్చు. గత ఖరీఫ్ సీజన్‌లో ఒక ఎకరా భూమి కలిగిన రైతులకు ఒక విత్తన బ్యాగును అందించారు. ఐదెకరాల లోపు ఉన్న వారికి మాత్రం మూడు బస్తాలకే పరిమితం చేశారు. దీంతో వారంతా మార్కెట్‌లో అధిక ధరలకు విత్తనాలు కొనుగోలు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ ఏడాది పంట విస్తీర్ణం పెరిగే అవకాశం ఉండగా.. వైసీపీ సర్కారు నిబంధనలతో అందరికీ పూర్తిస్థాయిలో విత్తనాలు అందుతాయా? అన్నది ప్రశ్నార్థకంగా మారింది. వాస్తవంగా జిల్లాలో 80 వేల మందికి పైగానే రైతులు ఏటా ఖరీఫ్ వరి సాగు చేపడుతున్నారు. అయితే గతేడాది 30 వేల క్వింటాళ్లకు ప్రతిపాదనలు పంపిన అధికారులు ఈ సారి 26,416 క్వింటాళ్ల విత్తనాలకే ఇండెంట్ పెట్టడంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది.



గరుగుబిల్లి మండలంలో నారుమళ్లను సిద్ధం చేసిన దృశ్యం

వైభవంగా పైడిమాంబ దేవర ఉత్సవం

విజయనగరం రూరల్, మే 20: మేళతాళాలు.. చిన్నారుల కోలాటాలు.. శక్తివేషాల నృత్యాలు.. వేదమంత్రోచ్చారణల మధ్య సోమవారం రాత్రి విజయనగరంలో దేవర ఉత్సవం వైభవంగా జరిగింది. తొలుత సాయంత్రం వనంగుడి వద్ద ప్రత్యేక వాహనంలో ఉన్న పైడిమాంబకు పూజలు నిర్వహించారు. అనంతరం దేవర ఉత్సవ ఊరేగింపు సాయంత్రం 5.45 గంటలకు ప్రారంభమైంది. రైల్వేస్టేషన్ రోడ్డు, ఎన్‌సీఎస్ రోడ్డు, కన్యకాపరమేశ్వరీ ఆలయం, ఉల్లివీధి మీదుగా పూజారి బంటుపల్లి వెంకటరావు నివాసానికి చేరుకుంది. అక్కడ ఘటాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి 9 గంటలకు హుకుంపేట నుంచి ఊరేగింపు మళ్లీ ప్రారంభమై రైల్వే స్టేషన్ రోడ్డులో వున్న పెద్ద చెరువు వద్దకు చేరుకుంది. అక్కడ పూజలు అనంతరం జాలర్లు చెరువులోకి దిగి సంప్రదాయం ప్రకారం పైడిమాంబను పిలిచారు. అనంతరం తెల్లవారు జామున 5 గంటలకు తిరిగి రైలే్వస్టేషన్ నుంచి పైడి మాంబ చదురుగుడికి చేరుకున్నారు. పైడిమాంబను రైల్వే స్టేషన్ వద్ద నుంచి మూడులాంతర్లు వద్ద ఉన్న చదురుగుడికి తీసుకురావడమే దేవర ఉత్సవం ప్రధాన ఉద్దేశం. ఈ ఉత్సవం అక్టోబరులో జరిగే సిరిమానోత్సవానికి నాంది వంటిది. పైడిమాంబకు మంగళవారం ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహిం చనున్నారు. ఉదయం 5.45 గంటలకు సుప్రభాత సేవ అనంతరం భక్తులకు దర్శనం కల్పించనున్నారు. ఇందుకోసం ప్రత్యేక క్యూ లైన్లు ఏర్పాటు చేశారు.



విజయనగరంలో పైడిమాంబను ఊరేగిస్తున్న దృశ్యం

పనులు చేసినా.. డబ్బులు జమకాలే!

- చినకుదమ ఉపాధి వేతనదారుల నిరసన
- ప్రతి వారం రూ. 100 చొప్పున వసూలు
- న్యాయం చేయాలని డిమాండ్

జియ్యమ్మవలస, మే 20 : ఉపాధి వేతనం ఇవ్వడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులు, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని చినకుదమ గ్రామ ఉపాధి వేతనదారులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఎంపీడీవో కార్యాలయం ఎదుట గంట సేపు నిరసన కార్యక్రమం చేపట్టారు. గ్రామంలో రెండు గ్రూపులకు చెందిన వారమంతా చినకుదమ - గౌరీపురం గ్రామాల మధ్య ఉన్న చింతలసాగరం చెరువులో రెండు వారాల పాటు పనిచేశామని వారు తెలిపారు. అయితే ఒక వారం కొంతమందికే డబ్బులు పడ్డాయని, ఇంకొక వారం పూర్తిగా డబ్బులు పడలేదని చెప్పారు. ఇదేమిటని ఉపాధి హామీ అధికారులను ప్రశ్నిస్తే 'మరి మీకు డబ్బులు పడవు' అంటూ నిర్లక్ష్యంగా చెబుతున్నారని వారు తెలియజేశారు. ఇదిలా ఉండగా ఉపాధి పనులు ప్రారంభం కాగానే ఒక్కో వేతనదారు వారానికి రూ. 100 మేట్ల ద్వారా వసూలు చేస్తున్నారని వేతనదారులు వాపోయారు. క్షేత్ర, సాంకేతిక సహాయ కులకు, ఆపై అధికారులకు ఇవ్వాలని, డబ్బులు ఇవ్వకుంటే బిల్లులు ఆపేస్తామని హెచ్చరిస్తున్నారని ఆరోపించారు. గ్రామంలో ఏడు గ్రూపుల్లో ఉన్న దాదాపు 800 మంది నుంచి వారానికి రూ. 80 వేలు వసూలు చేస్తున్నారని వారు తెలిపారు. గత ఐదేళ్ల నుంచి తమకు వంద రోజుల పాటు పని కల్పించలేదన్నారు. 2023-24లో ఐదు వారాలు పని కల్పిస్తే, మూడు వారాల డబ్బులు చెల్లించ లేదని వెల్లడించారు. దీనిపై సమగ్ర విచారణ జరిపించి తమకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు.



ఎంపీడీవో కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేస్తున్న చినకుదమ ఉపాధి వేతనదారులు

వసూలు చేస్తున్నారు

మా పంచాయతీలో ప్రతి వేతన దారు నుంచి వారానికి రూ. 100 చొప్పున మేట్లు వసూలు చేస్తున్నారు. వాటిని క్షేత్ర సహాయకునికి అందిస్తున్నారు.

- టొంప పవన్‌కుమార్, ఉపాధి కూలీ, చినకుదమ

మా పొట్ట కొట్టొద్దు

ఉపాధి పనులు కల్పించి డబ్బులు చెల్లించకపోవడం దారుణం. ఎవరూ పొట్ట కొట్టొద్దు. దీనిపై అధికారులు స్పందించాలి.

- టొంప సీతమ్మ, ఉపాధి కూలీ, చినకుదమ

విచారణ చేస్తాం

చినకుదమ ఉపాధి హామీ పనుల్లో అవకతవకలు జరిగినట్టు వేతనదారుల ద్వారా తెలిసింది. పూర్తిస్థాయిలో విచారణ జరిపి బాధ్యులపై చర్యలకు కలెక్టర్‌కు నివేదిక అందిస్తాం.

- పి.శ్రీనివాసరావు, ఎంపీడీవో, జియ్యమ్మవలస

24 నుంచి ఇంటర్ సప్లిమెంటరీ

- ఇన్‌చార్జి డీఆర్వో కేశవనాయుడు

పార్వతీపురం, మే20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈ నెల 24 నుంచి జూన్ 7వ తేదీ వరకు ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు జరుగుతాయని ఇన్‌చార్జి డీఆర్వో జి.కేశవనాయుడు తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో ఆయన మాట్లాడుతూ.. వర్షాలు పడే అవకాశం ఉన్నందున పరీక్ష కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలన్నారు. జిల్లాలో 17 సెంటర్లలో తాగునీరు, వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకునే విధంగా బస్సులు నడపాలని సూచించారు. ఇంటర్ మొదటి సంవత్సరం వారికి ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, రెండో సంవత్సరం వారికి మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. ఆ సమయాల్లో విద్యుత్ అంతరాయం కలగకుండా చూడాలని ఆ శాఖాధికారులను ఆదేశించారు. పరీక్ష పేపర్లను నిర్దేశిత కేంద్రాలకు పంపించే ఏర్పాట్లు చేయాలని పోస్టల్ శాఖను కోరారు. బందోబస్తు పక్కాగా ఉండాలని పోలీసులకు సూచించారు. పరీక్షల సమయంలో 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. సమావేశంలో ఇంటర్ జిల్లా అధికారి డి.మంజులవీణ, తదితరులు పాల్గొన్నారు.

ఇంకెన్నాళ్లిలా?

- గిరిజనులకు తప్పని డోలీ కష్టాలు

సీతంపేట: ఏళ్ల గడుస్తున్నా.. గిరిజనులకు డోలీ కష్టాలు తీరడం లేదు. వారి గ్రామాలకు రహదారి సౌకర్యం లేకపోవడంతో.. అత్యవసర వేళల్లో ఇలా మోతలు తప్పడం లేదు. వివరాల్లోకి వెళ్తే.. ఇటీవల కిండంగి వద్ద జరిగిన ఆటో ప్రమాదంలో జాతాపు జజ్జువ గ్రామానికి చెందిన నిమ్మక మాణిక్యం కాలుకు గాయమైంది. దీంతో కుటుంబ సభ్యులు ఆమెను పాలకొండ ఏరియా ఆసుపత్రికి తరలించారు. వారం రోజులు వైద్యులు చికిత్స అందించారు. పరిస్థితి మెరుగవడంతో సోమవారం డిశ్చార్జ్ చేశారు. దీంతో ఆమెను అంబులెన్స్‌లో పాలకొండ నుంచి కిండంగి వరకు తీసుకొచ్చారు. అక్కడ నుంచి జజ్జువ గ్రామం వరకు ఘాట్ రోడ్డు కావడంతో కుటుంబ సభ్యులు ఆటోలో సవర జజ్జువ వరకు తీసుకెళ్లారు. ఆ తర్వాత రెండు కిలోమీటర్ల మేర జాతాపు జజ్జువ వరకు ఉన్న రహదారి అధ్వానంగా మారడంతో వాహనాలు రాకపోకలు సాగించలేని పరిస్థితి. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో మండుటెండలో మాణిక్యాన్ని డోలీలో గిరిశిఖర గ్రామమైన జాతాపు జజ్జువ వరకు మోసుకుని వెళ్లినట్టు ఆ ప్రాంతానికి చెందిన నిమ్మక నందు తెలిపాడు. తమ గ్రామంలో ఎవరు అనారోగ్యం గురైనా డోలీ మోతలు తప్పడం లేదని వాపోయాడు. రహదారి పనులు పూర్తి చేయాలని ఎన్నిసార్లు అధికారులు, ప్రజాప్రతి నిధులకు వేడుకున్నా ఫలితం లేకపోయిందని ఆ గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు.



డోలీలో మాణిక్యాన్ని తీసుకెళ్తున్న గ్రామస్థులు

ఇది అంతర్రాష్ట్ర రహదారే..



పార్వతీపురం నుంచి కూనేరు వరకు ఉన్న అంతర్రాష్ట్ర రహదారి మరింత అధ్వానంగా మారింది. దారి పొడవునా భారీ గుంతలతో నిండిన ఈ మార్గంలో పట్టుమని కిలోమీటరు కూడా సక్రమంగా ప్రయాణించ లేని పరిస్థితి. పార్వతీపురం డంపింగ్ యార్డు నుంచి రాష్ట్ర సరిహద్దు కూనేరు గ్రామం వరకు ఉన్న రహదారిలో పెద్ద పెద్ద గోతులు ఏర్పడగా, గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వాటిల్లో నీరు చేరింది. ఈ కారణంగా ద్విచక్ర వాహనదారులు, కార్లు, ఆటోలు నడిపేవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గోతులను నీటి వల్ల అంచనాలు వేయలేక పలువురు ప్రమాదాలకు గురవుతున్నారు. మొత్తంగా రోడ్డు ఎక్కడుందోనని వాహనదారులు వెతుక్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. అసలు ఈ మార్గంలో నిత్యం వందలాదిగా భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఒడిశా, ఛత్తీస్‌ఘడ్, జార్ఖండ్, మధ్యప్రదేశ్, తదితర రాష్ట్రాలకు లారీలతో సరుకులను తరలిస్తుంటారు. ఇంతటి కీలకమైన దారిలో రాష్ట్ర పరిధిలోని రోడ్డు నిర్వహణను గత ఐదేళ్లుగా వైసీపీ సర్కారు గాలికొదిలేసింది. దీనిపై ప్రజా సంఘాలు, విపక్షాలు ఆందోళనలు చేసిన సంఘటనలు కూడా లేకపోలేదు. ఈ రహదారి గోతుల్లో వాహనాలు దిగబడిపోతుండడంతో... తరచూ ట్రాఫిక్ జామ్ సమస్య తలెత్తుతోంది. ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోతున్నాయి. మొత్తంగా ఈ రోడ్డుపై ప్రయాణం నరకప్రాయంగా మారింది. తక్షణమే అధికార యంత్రాంగం స్పందించి.. కనీసం గోతులను పూడ్చాలని జిల్లావాసులు, వాహనదారులు కోరుతున్నారు.


- కొమరాడ

కౌంటింగ్‌కు కౌంట్‌డౌన్



- ఓట్ల లెక్కింపునకు ముంచుకొస్తున్న సమయం
- అభ్యర్థుల్లో ఉత్కంఠ.. ద్వితీయశ్రేణుల్లో టెన్షన్
- జిల్లాలో ఎక్కడ చూసినా ఇదే చర్చ

పార్వతీపురం, మే20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఓట్ల లెక్కింపునకు సమయం దగ్గర పడుతోంది. ఏ ఇద్దరు కలిసినా దీనిపైనా చర్చించకుంటున్నారు. ఈసారి ఏ పార్టీ అధికారంలోకి వస్తుంది.. ఎవరికి ఎన్ని సీట్లు వస్తాయి.. జిల్లాలో ఎవరు గెలుస్తారన్న అంశాల చుట్టూనే చర్చలు కొనసాగుతున్నాయి. కౌంటింగ్‌కు సమయం ముంచుకొస్తుండడంతో ప్రధాన పార్టీల అభ్యర్థుల్లోనూ టెన్షన్ మొదలైంది. ద్వితీయశ్రేణి నాయకత్వంలోనూ ఇదే పరిస్థితి ఉంది. ఈ సారి ఎన్నికల్లో పోలింగ్ శాతం పెరగడంతో.. ఇది తమకు అనుకూలమని ఎన్డీఏ కూటమి అభ్యర్థులు అభిప్రాయపడుతున్నారు. తమదే విజయమని చెబుతున్నారు. వైసీపీ అభ్యర్థులు మాత్రం విజయావకాశాలపై ఎక్కడా మాట్లాడడం లేదు. సర్కారుపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకత, సీఎం జగన్ తీసుకున్న నిర్ణయాలతో ఓట్ల రూపంలో వైసీపీకి పెద్ద దెబ్బ తగిలిందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. వాస్తవంగా వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల కాలంలో అభివృద్ధి శూన్యం. మరోవైపు నిత్యావసరాల ధరలు, ఆర్టీసీ, విద్యుత్ చార్జీల పెంపు, అధిక పన్నులు తదితర వాటిని ప్రజలు మౌనంగా భరించారు. ఈ నెల 13న మాత్రం తెగించారు. కసి తీరా ఓటేశారు. సుదూర ప్రాంత వాసులు కూడా పెద్దఎత్తున జిల్లాకు తరలివచ్చి.. పోలింగ్ కేంద్రాల్లో గంటల తరబడి నిరీక్షించి మరీ తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇదంతా వైసీపీ ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకతకు నిదర్శమని రాజకీయ విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు.



ఇదీ పరిస్థితి..



ఈ నెల 13న పోలింగ్ ముగిసింది. మొత్తంగా 77.10 శాతం మేర ఓటింగ్ నమోదైంది. గత ఎన్నికలతో పోలిస్తే కాస్త పోలింగ్ పెరిగింది. ఈవీఎంలలో ప్రజల తీర్పు నిక్షిప్తమైంది. జిల్లాలో నాలుగు నియోజకవర్గాలకు చెందిన ఈవీఎంలు గరుగుబిల్లి మండలం ఉల్లిభద్ర ఉద్యాన కళాశాలలో స్ట్రాంగ్ రూములకు చేరాయి. అయితే కౌంటింగ్‌కు మరికొద్ది రోజులే ఉండడంతో ప్రధాన పార్టీల అభ్యర్థుల్లో టెన్షన్ ప్రారంభమైంది. ఈ మేరకు రోజూ తమ అనుచరులతో వారు కూర్చొని 'ఏయే పోలింగ్ కేంద్రాల్లో ఎన్ని ఓట్లు పడ్డాయి, మనకి ఎన్ని వస్తాయి.. ప్రత్యర్థి అభ్యర్థికి ఎన్ని ఓట్లు పడతాయి' అని లెక్కలేసుకుంటున్నారు. విజయావకాశాలపై ఎవరికి వారు చర్చించుకుంటున్నారు. కాగా జిల్లాలోని నాలుగు నియోజకవర్గాలలోనూ టీడీపీలో జోష్ కనిపిస్తోంది. అధికారపార్టీ వైఫల్యాలతో పాటు ప్రభుత్వంపై అన్నివర్గాలలో నెలకొన్న తీవ్ర అసంతృప్తే ఇందుకు ప్రధాన కారణంగా ఆయా వర్గాలు చెప్పుకుంటున్నాయి. ఇదే సమయంలో తెలుగుదేశం పార్టీ మేనిఫెస్టోలో ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలు ఆకట్టుకున్నాయనేది అందరూ అనుకుంటున్న మాట. వైసీపీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను తుంగలోకి తొక్కడం, కొత్తగా ప్రకటించిన మేనిఫెస్టో చప్పగా ఉందని అందరూ అభిప్రాయపడడం కూడా టీడీపీకి కలిసి వస్తుందంటున్నారు.

- వైసీపీ అభ్యర్థులు పైకి మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నా లోలోన మాత్రం ఆందోళన చెందుతున్నారు. పెరిగిన ఓటింగ్ శాతం తమకు ముప్పేనని మథనపడుతున్నారు. కాగా అభ్యర్థుల గెలుపుపై జిల్లాలో జోరుగా బెట్టింగ్‌లు సాగుతున్నాయి. కమీషన్ ఏజెంట్లు రంగంలోకి దిగి.. ఇరు వర్గాలను రెచ్చగొట్టి మరీ ఈ తతంగాన్ని నడిపిస్తున్నారు. ఇప్పటికే జిల్లాలోని ఓ మండలంలో కోటి రూపాయలు దాటి బెట్టింగ్ జరిగినట్లు సమాచారం. మరికొందరు రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలోకి వస్తుందనే దానిపై కూడా పందాలు కాస్తున్నారు. జిల్లాలో కొన్ని నియోజకవర్గాల్లో కూటమి అభ్యర్థులకే విజయావకాశాలు ఎక్కువగా ఉన్నాయనే ప్రచారం జోరుగా సాగుతోంది. మరికొన్ని నియోజకవర్గాల్లో పోటీ 'నువ్వానేనా' అన్న విధంగా ఉంది. ఇదిలా ఉండగా రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం ఏర్పడడం తథ్యమని ఇప్పటికే కొంతమంది రాజకీయ విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు. అత్యధిక సర్వేలు కూడా ఇదే విషయాన్ని చెబుతున్నాయి. దీంతో వైసీపీ వర్గాలు తీవ్ర ఆందోళన చెందుతున్నాయి.

ఫలితాలను శాసించేది

పోస్టల్ బ్యాలెట్లే..

- ఈ సారి పెరిగిన పోలింగ్ శాతం
- కూటమికి అనుకూలంగా ఓట్లు పడినట్లు ప్రచారం
- వైసీపీ వర్గాల్లో కలవరం



సాలూరు రూరల్, మే 20: ఓట్ల లెక్కింపులో పోస్టల్ బ్యాలెట్ ఎంతో కీలకం. కౌంటింగ్ రోజున తొలుత వాటినే లెక్కిస్తారు. పోస్టల్ బ్యాలెట్‌లో మెజార్టీ వస్తే.. ఈవీఎం లెక్కింపులో సైతం ఆ పార్టీకి తిరుగులేదు. విజయం తథ్యమనే విశ్వాసం బలంగా ఉంది. గత ఎన్నికల్లోనూ పోస్టల్ బ్యాలెట్లే ఫలితాలను శాసించాయి. అందుకే అందరి చూపు ఇప్పుడు వాటిపై పడింది. 2014 ఎన్నికల్లో పోస్టల్ బ్యాలెట్లలో టీడీపీ అభ్యర్థులకు మెజార్టీ పోస్టల్ బ్యాలెట్ ఓట్లు పడ్డాయి. అప్పుడు టీడీపీ ప్రభుత్వం పాలనా పగ్గాలు చేపట్టింది. 2019లో పోస్టల్ బ్యాలెట్లలో వైసీపీ మెజార్టీ సాధించింది. దీంతో 2024 సార్వత్రిక ఎన్నికల్లో పోస్టల్ బ్యాలెట్లకు మరింత ప్రాధాన్యం ఏర్పడింది. అయితే ఎన్నడూ లేని విధంగా ఈ సారి జిల్లాలో అత్యధిక శాతం ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ 95 శాతం దాటగా.. కూటమి అభ్యర్థులకు అనుకూలంగా పోస్టల్ బ్యాలెట్ ఓట్లు పడినట్లుగా సర్వత్రా చర్చనీయాంశమవుతోంది. అయితే ఇప్పుడిదే అంశం వైసీపీ వర్గాలను కలవరపరుస్తోంది. పోస్టల్ బ్యాలెట్‌లో మెజార్టీ సాధిస్తే.. ఆ పార్టీయే అధికారంలోకి వచ్చే అవకాశం ఉండడంతో వారు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. జిల్లాలోని నాలుగు నియోజక వర్గాల్లో 8,458 మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకోగా వారిలో 8,028 మంది ఓటు వేశారు. పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ పెరగడంతో వైసీపీ నేతల్లో గుబులు రేగుతోంది.

ఇండియా శ్రామిక మార్కెట్

(సోమవారం (20.5.24) దిక్సూచి తరువాయి)

ఉపాధి సంబంధిత సవాళ్లు

తక్కువ అవకాశాలు - ఆర్థిక వ్యవస్థ నిర్మాణంలో కనిపించని మార్పు: అధికంగా నమోదవుతున్న ఆర్థిక వృద్ధిరేటు అదే స్థాయిలో ఉపాధి అవకాశాలను సృష్టించడంలో విఫలమవుతున్నది. సేవలరంగం సహాయంతో మూలధన సాంద్రత పద్ధతిలో ఆర్థికవృద్ధి జరగడమే ఇందుకు ప్రధాన కారణం. ఇందుకు విరుద్ధంగా అభివృద్ధి చెందిన దేశాలు పారిశ్రామికరంగం సహాయంతో అధిక వృద్ధిని సాధించాయి. ఇది లేకపోవడం వల్ల భారత ఆర్థికవ్యవస్థ నిర్మాణంలో చెప్పుకోదగ్గ మార్పు రావడంలేదు.

అసమానతల శ్రామిక మార్కెట్-సాంకేతిక సవాళ్లు: నూతన సాంకేతిక పరిజ్ఞానం శ్రామిక మార్కెట్‌లో అనేక మార్పులు తెచ్చింది. మూలధన సాంద్రత ప్రక్రియ రోజురోజుకూ పెరుగుతోంది. ఫలితంగా ఉద్యోగావకాశాల వృద్ధి తక్కువగా ఉంటున్నది. అధిక నైపుణ్యం అవసరమైన ఉద్యోగావకాశాలు పెరుగుతుండగా, తక్కువ నైపుణ్యం, నైపుణ్యం అవసరంలేని ఉపాధి అవకాశాలు తగ్గుతున్నాయి. ప్రాంతాలు, సామాజిక వర్గాలు, లింగపరమైన, వృత్తులపరంగా శ్రామిక మార్కెట్‌లో పెద్ద ఎత్తున అసమానతలు పెరుగుతున్నాయి.

ప్రాంతీయ అసమానతలు: ప్రత్యేకించి యువతకు ఉపాధి అవకాశాల సృష్టిలో దేశంలో ప్రాంతీయపరంగా తీవ్ర వ్యత్యాసాలు ఉన్నాయి. తూర్పు, మధ్య భారతదేశంలో గల రాష్ట్రాలు అభివృద్ధిలో వెనుకబడి ఉన్నాయి. తక్కువ తలసరి ఆదాయాన్ని కలిగి ఉన్నాయి. ఉన్నత విద్య అభ్యసించిన యువత శాతం తక్కువగా ఉంది. సంఘటితరంగ ఉద్యోగిత తక్కువగా ఉంది. ఉద్యోగంలో, విద్యాలయాల్లో, శిక్షణలో గానీ లేని యువత శాతం ఈ ప్రాంతాల్లో ఎక్కువగా ఉంది. ప్రాంతాల వారీగా ఉద్యోగితా విధానాలు రూపొందించాల్సిన అవసరాన్ని పై అసమానతలు సూచిస్తున్నాయి.

విద్య-నైపుణ్యం-ఉపాధి సవాళ్లు-సంక్షోభం: 2000-2022 మధ్యకాలంలో ఉన్నతవిద్య అభ్యసించిన వారిలో నిరుద్యోగ శాతం పెరిగింది. విద్యకు, ఉపాధికి అవసరమైన అధికస్థాయి నైపుణ్యానికి గల తేడాను ఈ పరిస్థితి చూపిస్తున్నది.

సాంకేతికతలో, పర్యావరణంలో మార్పులు: సాంకేతికరంగంలో వస్తున్న అనూహ్య మార్పులు శ్రామిక మార్కెట్‌కు కొత్త సవాళ్లను విసురుతున్నాయి. ఉదాహరణకు సాంకేతికతలో వచ్చిన కృత్రిమ మేధ(ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్-ఏఐ) కొత్త ఉపాధి అవకాశాలతోపాటు అనేక సవాళ్లను శ్రామిక మార్కెట్ ముందు పెట్టింది. అంతేకాకుండా పర్యావరణంలో వస్తున్న మార్పులు అసంఘటితరంగ కార్మికుల జీవితాలను వ్యతిరేకంగా ప్రభావితం చేస్తున్నాయి. అయినప్పటికీ పర్యావరణ రక్షిత సుస్థిర వృద్ధి ప్రక్రియలో నూతన పర్యావరణ(గ్రీన్) ఉద్యోగాల సృష్టికి అవకాశాలు పెరుగుతున్నాయి. ఉదాహరణకు భారతదేశం 2030 నాటికి 500 గిగావాట్ల(జీడబ్ల్యూ) కాలుష్యరహిత విద్యుత్ ఉత్పత్తిని లక్ష్యంగా పెట్టుకుంది. సౌరశక్తి, వాయుశక్తి లాంటి పునఃవినియోగిత ఇంధన సృష్టి ద్వారా ఈ లక్ష్యాన్ని సాధించాలనుకుంటున్నారు. ఈ ప్రక్రియలో 30,40,000(సత్వర, దీర్ఘకాలాల్లో) ఉద్యోగాల సృష్టి జరిగే అవకాశం ఉంది. ఈవిధంగా సాంకేతికతలో, పర్యావరణంలో వస్తున్న మార్పులు సవాళ్లతోపాటు అవకాశాలను సృష్టిస్తున్నాయి.

యువత ఉపాధి సవాళ్లు: ఇండియాలో పనిచేయగల వయసు ఉన్నవారు 2011లో 59 శాతం ఉండగా 2021 నాటికి 63 శాతానికి పెరిగింది. రాబోయే 15 సంవత్సరాలు ఇదే పరిస్థితి స్థిరంగా ఉండనుంది. ఇండియా తన జనాభా నిధి(డెమోగ్రాఫిక్ డివిడెండ్)ని ఉపయోగించుకోవడంలో చివరిదశకు చేరింది. దేశం మొత్తం జనాభాలో యువత శాతం తగ్గడం ఆరంభమైనా అది ఇంకా 27 శాతం(దాదాపు 37 కోట్లు) ఉండటం, ఇతర దేశాలతో పోలిస్తే చాలా ఎక్కువనే చెప్పాలి.

యువ జనాభాలో తగ్గుతున్న శ్రామిక భాగస్వామ్య నిష్పత్తి: యువ జనాభాలో 2000 సంవత్సరంలో శ్రామిక భాగస్వామ్య నిష్పత్తి 54 శాతం ఉండగా 2022 నాటికి 44 శాతానికి తగ్గింది. యువత వయసు దశల ఆధారంగా(15-19, 20-24, 25-29) అది తీవ్రంగా తగ్గుతుండటం గమనార్హం. 2000, 2019 సంవత్సరాల మధ్య యువ కార్మికశక్తి, యువ జనాభా మధ్య నిష్పత్తి కూడా తగ్గిందని అంతర్జాతీయ కార్మిక సంస్థ వివరించింది.



ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం

ఇండియన్ ఎకానమీ

యువతలోనే ఎక్కువ నిరుద్యోగం: ప్రపంచవ్యాప్తంగా ఎక్కువ వయసు వారితో పోల్చితే మూడురెట్లు అధికంగా యువతలో నిరుద్యోగం ఉంది. ఇండియాలో కూడా ఇతర అధిక వయసు వారి కంటే యువతలో నిరుద్యోగం ఎక్కువగానే ఉంది. అంతేకాకుండా గత అనేక దశాబ్దాలుగా అది పెరుగుతూ ఉంది. ఇండియాలో యువతలో నిరుద్యోగం 2000 సంవత్సరంలో 5.6 శాతం ఉండగా, 2012లో 6.2 శాతం, 2018లో 18 శాతం, 2020లో 15.1 శాతంగా ఉంది.

చదువుకున్న యువతలో తీవ్ర నిరుద్యోగం: భారతీయ యువత ఉన్నతవిద్య అభ్యసిస్తున్నారు కానీ ఉద్యోగాల సృష్టి తగినంతగా జరగడం లేదని అంతర్జాతీయ కార్మికసంస్థ పేర్కొంది. నాలుగో తరగతి ఉద్యోగాల కోసం ఉన్నత విద్యావంతులు(పీహెచ్‌డీ, పీజీ, యూజీ కలిగినవారు) వేలు, లక్షలుగా దరఖాస్తు చేయడాన్ని ఇందుకు ఉదాహరణగా ఐఎల్‌ఓ పేర్కొంది. ఉత్తరప్రదేశ్ పోలీసుశాఖలో '62' ప్యూన్ ఉద్యోగాల కోసం 93 వేల మంది దరఖాస్తు చేసుకున్నారు. అందులో 3,700 మంది డాక్టరేట్లు, 5,000 మంది గ్రాడ్యుయేట్స్, 28,000 మంది పోస్ట్ గ్రాడ్యుయేట్స్ ఉన్నారు. ఉద్యోగానికి అవసరమైన విద్యార్హత కేవలం 'అయిదో తరగతి' కావడం గమనార్హం.

- ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం నిర్వహించిన మరో గ్రూప్-డి ఉద్యోగ పరీక్షకు 55 లక్షలకు పైగా దరఖాస్తులు వచ్చాయి. ప్యూన్, వాచ్‌మన్, గార్డెనర్ లాంటి ఈ ఉద్యోగాలకు దరఖాస్తు చేసిన వారిలో చాలామంది ఉన్నత విద్యావంతులు ఉన్నారు. మధ్యప్రదేశ్‌లో 15 ప్యూన్, డ్రైవర్, వాచ్‌మన్ ఉద్యోగాలకు 11వేలమంది దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తు చేసిన వారిలో డాక్టరేట్లు, పోస్ట్ గ్రాడ్యుయేట్స్, గ్రాడ్యుయేట్స్ ఉన్నారు. 2022లో బిహార్‌లో 15వేల రైల్వే ఉద్యోగాలకు లక్షల కొద్దీ నిరుద్యోగులు బిహార్, ఉత్తరప్రదేశ్ నుంచి దరఖాస్తు చేసుకున్నారు. రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు ఉద్యోగ పరీక్ష ఫలితాల్లో అక్రమాలకు పాల్పడిందని 2023 జనవరిలో భారీఎత్తున నిరుద్యోగులు రోడ్ల మీద కొచ్చారు. అభివృద్ధి చెందిన రాష్ట్రంగా చెప్పుకుంటున్న గుజరాత్‌లో 2022 జనవరిలో పదో తరగతి అర్హతతో 3,400 ఉద్యోగాలకు ప్రకటన ఇస్తే 1,70,00 మంది నిరుద్యోగులు దరఖాస్తు చేసుకున్నారు.
- చదువుకున్న యువతలో నిరుద్యోగం ఎంత తీవ్రంగా ఉందో పై సంఘటనలు సూచిస్తున్నాయని అంతర్జాతీయ కార్మికసంస్థ రూపొందించిన ఇండియా ఎంప్లాయ్‌మెంట్ నివేదిక-2024 పేర్కొంది.
- 2010-2019 మధ్యకాలంలో దక్షిణాసియాలోని యువతలో 29.2 శాతం ఉద్యోగాల్లో, విద్యాలయాల్లో, శిక్షణలో గానీ లేరని నివేదిక తెలిపింది. ఇండియా పరిస్థితి కూడా అదేవిధంగా ఉంది. ఇండియాలో మహిళల్లో ఈ పరిస్థితి పురుషుల కంటే ఎక్కువగా ఉంది.

శ్రామిక భాగస్వామ్య నిష్పత్తిలో లింగపరమైన అసమానత: గడిచిన రెండు దశాబ్దాలుగా శ్రామిక భాగస్వామ్య నిష్పత్తిలో తీవ్రమైన అసమానత అలాగే స్థిరంగా కొనసాగుతున్నది. 2022లో యువకుల్లో శ్రామిక భాగస్వామ్య నిష్పత్తి 61.2 శాతం ఉండగా, యువతుల్లో కేవలం 21.7 శాతంగా ఉంది. గ్రామాలు, పట్టణాల్లోనూ పరిస్థితి ఇలాగే ఉంది. ఇది 'భారతీయ శ్రామిక మార్కెట్‌లో గల లింగపరమైన అసమానతలకు సూచిక'అని నివేదిక వ్యాఖ్యానించింది.

తక్కువ నాణ్యత గల ఉద్యోగాల్లో యువత: పెద్ద వయసు(30 సంవత్సరాలు, 30 సంవత్సరాల కంటే ఎక్కువ) వారితో పోలిస్తే యువత తక్కువ నాణ్యతతో కూడిన ఉద్యోగాల్లో ఎక్కువగా ఉన్నారు. యువత పారిశ్రామిక, సేవారంగాల్లో ఎక్కువగా ఉన్నప్పటికీ రోజువారీ ఉద్యోగాల్లో, ప్రతిఫలం చెల్లించని కుటుంబ సంబంధిత పరిశ్రమల్లో, తక్కువ ఆదాయంతో కూడిన స్వయంఉపాధిలో యువత ఎక్కువగా ఉన్నారు. తక్కువ వేతనం, తక్కువ ఆదాయం ఇచ్చే తక్కువ నైపుణ్యం అవసరమైన ఉపాధిలో లేదా అసలే నైపుణ్యం అవసరం లేని ఉపాధిలో యువత పెద్దవారి కంటే ఎక్కువగా ఉన్నట్లు అంతర్జాతీయ కార్మికసంస్థ(ఐఎల్‌ఓ) న్యూఢిల్లీలోని మానవాభివృద్ధి సంస్థతో కలిసి తయారుచేసిన 2024 భారత ఉద్యోగస్థితి(ఇండియా ఎంప్లాయ్‌మెంట్) నివేదిక తెలిపింది.

- భారతదేశం ఎదుర్కొంటున్న తీవ్రమైన నిరుద్యోగ సంక్షోభాన్ని ప్రత్యేకించి చదువుకున్న యువత నిరుద్యోగ స్థితిని ప్రాంతాల వారీగా, వివిధ సామాజిక వర్గాల వారీగా, లింగపరంగా, వృత్తులపరంగా భారత శ్రామిక మార్కెట్‌లో అసమానతలను పై నివేదిక తేటతెల్లం చేసింది. అధిక 'ఆర్థిక వృద్ధిరేటు, అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా అవతరించడం సమస్యకు పరిష్కారం కాదు' అని కూడా నివేదిక సారాంశం. ప్రాంతాలు, వివిధ సామాజిక వర్గాలు, లింగపరంగా, వివిధ రంగాలవారీగా ప్రత్యేక ఉపాధి వ్యూహ విధానాల అవసరాన్ని నివేదిక నొక్కి చెప్పింది.



డా.ఎం.ఏ.మాలిక్,
అసోసియేట్ ప్రొఫెసర్,
ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కూకట్‌పల్లి,
హైదరాబాద్.

దిక్సూచి
DIKSUCHI

హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ- తెలంగాణ స్టేట్ కామన్ పోస్ట్ గ్రాడ్యుయేట్ ఎంట్రెన్స్ టెస్ట్(టీఎస్ సీపీజీఈటీ) 2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దీని ద్వారా పీజీ, పీజీ డిప్లొమా, ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశాలు కల్పిస్తారు. జేఎన్‌టీయూహెచ్, తెలంగాణ మహిళ విశ్వవిద్యాలయం సహా కాకతీయ, ఉస్మానియా, శాతవాహన, తెలంగాణ, మహాత్మాగాంధీ, పాలమూరు యూనివర్సిటీల క్యాంపస్‌లు, గుర్తింపు పొందిన పీజీ కళాశాలల్లో అడ్మిషన్స్ ఇస్తారు. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

తెలంగాణ కామన్ పీజీ ఎంట్రెన్స్ టెస్ట్

పీజీ ప్రోగ్రామ్‌లు

ఎంఏ స్పెషలైజేషన్‌లు: యాన్షియంట్ ఇండియన్ హిస్టరీ కల్చర్ అండ్ ఆర్కియాలజీ, అరబిక్, ఇంగ్లీష్, హిందీ, కన్నడ, మరాఠీ, పర్షియన్, సంస్కృతం, తెలుగు, ఉర్దూ, ఇస్లామిక్ స్టడీస్, లింగ్విస్టిక్స్, ఫిలాసఫీ, థియేటర్ ఆర్ట్స్, ఎకనామిక్స్ హిస్టరీ, జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్, పొలిటికల్ సైన్స్, సైకాలజీ, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, సోషియాలజీ.

- మాస్టర్ ఆఫ్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్, మాస్టర్ ఆఫ్ లైబ్రరీ సైన్స్, మాస్టర్ ఆఫ్ సోషల్ వర్క్, మాస్టర్ ఆఫ్ హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, మాస్టర్ ఆఫ్ టూరిజం మేనేజ్‌మెంట్.

ఎంకాం స్పెషలైజేషన్‌లు: జనరల్, ఐఎస్, ఈ కామర్స్ కంప్యూటర్ అప్లికేషన్స్, ఇన్సూరెన్స్ అండ్ బ్యాంకింగ్, ఫైనాన్షియల్ అకౌంటింగ్.

- ఎంఈడీ, ఎంపీఈడీ

ఎమ్మెస్సీ స్పెషలైజేషన్‌లు: బోటనీ, కెమిస్ట్రీ, ఆర్గానిక్ కెమిస్ట్రీ, ఇనార్గానిక్ కెమిస్ట్రీ, ఫిజికల్ కెమిస్ట్రీ, అనలిటికల్ కెమిస్ట్రీ, ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ, ఫిజికల్ ఆర్గానిక్ కెమిస్ట్రీ, ఫార్మాకోఇన్ఫర్మాటిక్స్, కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రానిక్స్, జాగ్రఫీ, జియో ఇన్ఫర్మాటిక్స్, జియాలజీ, అప్లయిడ్ జియో కెమిస్ట్రీ, మేథమెటిక్స్, అప్లయిడ్ మేథమెటిక్స్, మేథ్స్ విత్ కంప్యూటర్ సైన్స్, ఫిజిక్స్, ఆస్ట్రానమీ, ఆస్ట్రో ఫిజిక్స్, జియో ఫిజిక్స్, నానో సైన్స్, ఇంజనీరింగ్ ఫిజిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్, స్టాటిస్టిక్స్, అప్లయిడ్ స్టాటిస్టిక్స్, జువాలజీ, ఫిషరీస్, బయోకెమిస్ట్రీ, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, ఫోరెన్సిక్ సైన్స్, జెనెటిక్స్, మైక్రోబయాలజీ, ఫర్మంటేషన్ టెక్నాలజీ, బయోటెక్నాలజీ, న్యూట్రిషన్ అండ్ డైటెటిక్స్, ఫుడ్ సైన్స్, ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, సైకాలజీ, సెరికల్చర్, డేటా సైన్స్.

పీజీ డిప్లొమా

స్పెషలైజేషన్: చైల్డ్ సైకాలజీ, ఫ్యామిలీ మ్యారేజ్ కౌన్సెలింగ్, ఫోరెన్సిక్ సైన్స్, ఫార్మాస్యూటికల్ సైన్సెస్

అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్‌లు

- ఎమ్మెస్సీ(బయోటెక్నాలజీ/కెమిస్ట్రీ/ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ), ఎంఏ అప్లయిడ్ ఎకనామిక్స్, ఇంటిగ్రేటెడ్ ఎంబీఏ

అర్హత వివరాలు: ఎంఏ, మాస్టర్ ఆఫ్ లైబ్రరీ సైన్స్, ఎంఎస్‌డబ్ల్యు, ఎంహెచ్‌ఆర్‌ఎం, ఎంటీఎం ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి ఏదేని డిగ్రీ; ఎంఏ లాంగ్వేజ్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి సంబంధిత లాంగ్వేజ్ సబ్జెక్టులతో డిగ్రీ పూర్తిచేసి ఉండాలి. కనీసం 40 శాతం మార్కులు తప్పనిసరి. ఎంకాం కోర్సుల్లో ప్రవేశానికి బీకాం ఉత్తీర్ణులై ఉండాలి.

- ఎంఈడీలో ప్రవేశానికి బీఈడీ; ఎంపీఈడీలో ప్రవేశానికి బీపీఈడీ/ బీపీఈ ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం 55 శాతం మార్కులు తప్పనిసరి.
- ఎమ్మెస్సీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి సంబంధిత సబ్జెక్టులతో బీఏ/బీఎస్సీ/బీసీఏ ఉత్తీర్ణులై ఉండాలి. ఎమ్మెస్సీ(ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ) కోర్సుకు బీటెక్(ఫుడ్ సైన్స్/ఫుడ్ టెక్నాలజీ/ఫుడ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్/ఫుడ్ సైన్స్ అండ్ న్యూట్రిషన్/ఫుడ్ అండ్ న్యూట్రిషన్) ఉత్తీర్ణులు; ఎమ్మెస్సీ జియోఇన్ఫర్మాటిక్స్‌కు బీఈ/ బీటెక్ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఎమ్మెస్సీ బయోటెక్నాలజీకి డిగ్రీ(అగ్రికల్చర్/వెటర్నరీ సైన్స్/ఫార్మసీ/ఫిషరీస్) ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. మిగిలిన స్పెషలైజేషన్‌లకు బీఎస్సీ(ఎంఎల్‌టీ/ నర్సింగ్/ అగ్రికల్చర్/ హోం సైన్స్)/ బీఫార్మసీ/ బీఈ/ బీటెక్ అభ్యర్థులు అనర్హులు.
- పీజీ డిప్లొమా(ఫోరెన్సిక్ సైన్స్/ఫార్మాస్యూటికల్ సైన్సెస్)లో ప్రవేశానికి బీఎస్సీ(బోటనీ, జువాలజీ, కెమిస్ట్రీ) ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఫ్యామిలీ మ్యారేజ్ కౌన్సెలింగ్ స్పెషలైజేషన్‌కు ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు అర్హులు. చైల్డ్ సైకాలజీ స్పెషలైజేషన్‌కు డిగ్రీ స్థాయిలో సైకాలజీ ప్రధాన సబ్జెక్ట్‌గా చదివిన మహిళలు అప్లయ్ చేసుకోవచ్చు.
- ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్‌లలో ఎమ్మెస్సీ(బయోటెక్నాలజీ/కెమిస్ట్రీ/ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ)కి ఎంపీసీ/బైపీసీ/ఎంబైపీసీ గ్రూప్‌తో ఇంటర్/ పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. ఎంఏ అప్లయిడ్ ఎకనామిక్స్, ఐఎంబీఏలకు ఏదేని గ్రూప్‌తో ఇంటర్ పూర్తిచేసినవారు అప్లయ్ చేసుకోవచ్చు. ఇంటర్‌లో ద్వితీయ శ్రేణి మార్కులు తప్పనిసరి.

సీపీజీఈటీ 2024 వివరాలు

- దీనిని సీబీటీ విధానంలో నిర్వహిస్తారు. ఇందులో సంబంధిత సబ్జెక్ట్ నుంచి మొత్తం 100 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. అనాలజీస్, క్లాసిఫికేషన్, మ్యాచింగ్, కాంప్రహెన్షన్ ఆఫ్ రీసెర్చ్ స్టడీ/ఎక్స్‌పరిమెంట్/థియరీ అంశాల నుంచి ప్రశ్నలు అడుగుతారు.
- ఎమ్మెస్సీ(బయోకెమిస్ట్రీ/ఎన్విరాన్‌మెంటల్ సైన్స్/ఫోరెన్సిక్ సైన్స్/జెనెటిక్స్/మైక్రోబయాలజీ)కి నిర్వహించే ఎగ్జామ్‌లో కెమిస్ట్రీ నుంచి 40, ఫిజిక్స్/ బోటనీ/జువాలజీ/జెనెటిక్స్/మైక్రోబయాలజీ/బయోకెమిస్ట్రీ సబ్జెక్ట్ నుంచి 60 ప్రశ్నలు అడుగుతారు.
- ఎమ్మెస్సీ బయోటెక్నాలజీకి నిర్వహించే ఎగ్జామ్‌లో కెమిస్ట్రీ నుంచి 40 ప్రశ్నలు, బయోటెక్నాలజీ నుంచి 60 ప్రశ్నలు అడుగుతారు.
- ప్రశ్నకు ఒక మార్కు. చొప్పున మొత్తం మార్కులు 100. నెగెటివ్ మార్కులు లేవు. పరీక్ష సమయం గంటన్నర. పరీక్ష సిలబస్ కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.

ముఖ్యసమాచారం

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 17
- **సీపీజీఈటీ 2024 తేదీలు:** జూలై 5 నుంచి
- **వెబ్‌సైట్:** cpget.tsche.ac.in

'దిక్సూచి' వెబ్ పేజీలో.. సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/EtCsnUxలో చదవండి.

నవ్య | చిత్రజ్యోతి

పుట్టినరోజున కొత్త కబురు



మ్యాన్ ఆఫ్ మాసెస్ జూనియర్ ఎన్టీఆర్‌కు ప్రపంచవ్యాప్తంగా ఉన్న క్రేజ్, ఫ్యాన్ బేస్ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. దానిని దృష్టిలో ఉంచుకుని తన సినిమాల ఎంపిక ఎంతో కేర్ తీసుకుంటుంటారు ఎన్టీఆర్. ప్రస్తుతం అందరి దృష్టీ ఆయన చేస్తున్న 'దేవర', 'వార్ 2' చిత్రాల మీదే ఉంది. తాజాగా ఇప్పుడు మరో భారీ చిత్రాన్ని ఎన్టీఆర్ పుట్టినరోజు సందర్భంగా ప్రకటించారు. 'కేజీఎఫ్', 'సలార్' చిత్రాలతో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన దర్శకుడు ప్రశాంత్ నీల్ ఈ సినిమాకు దర్శకుడు కావడం విశేషం. 'ఎన్టీఆర్ నీల్' అనే వర్కింగ్ టైటిల్‌తో రూపుదిద్దుకొనే ఈ చిత్రం షూటింగ్ ఆగస్టులో ప్రారంభం కానుంది. మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మించనున్నాయి. ఎన్టీఆర్ స్టార్ పవర్, ప్రశాంత్ నీల్ విజనరీతో రూపుదిద్దుకొనే ఈ భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'కేజీఎఫ్'కు దీటుగా భారీ స్కేల్‌లో ఉంటూ ఇండస్ట్రీలో సరికొత్త బెంచ్ మార్క్ క్రియేట్ చేస్తుందంటున్నారు నిర్మాతలు. ప్రస్తుతం జూనియర్ ఎన్టీఆర్ 'దేవర', 'వార్ 2' చిత్రాలతో బిజీగా ఉన్నారు. ఈ రెండు ప్రాజెక్టులు పూర్తి చేసి ఆగస్టు నుంచి ప్రశాంత్ నీల్ సినిమా షూటింగ్‌లో పాల్గొంటారు.

పవర్‌ఫుల్ అవతార్‌లో...



మంచు మనోజ్ ఎనిమిదేళ్ల విరామం తర్వాత వెండితెరపైకి రీ ఎంట్రీ ఇస్తున్నారు. ఆయన ప్రతినాయకుడిగా నటిస్తున్న చిత్రం 'మిరాయ్'. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వం వహిస్తుండగా, టీజీ విశ్వ ప్రసాద్ నిర్మిస్తున్నారు. సోమవారం మంచు మనోజ్ పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమాలో ఆయన పాత్ర గ్లింప్స్‌ను 'ద బ్లాక్ స్వార్డ్' పేరుతో విడుదల చేశారు. ఈ గ్లింప్స్‌లో ఆయన చాలా పవర్‌ఫుల్ అవతార్‌లో కనిపించారు. ఈ సందర్భంగా మనోజ్ మాట్లాడుతూ "మిరాయ్' కథ విన్నప్పుడు అద్భుతంగా అనిపించింది. ఈ సినిమా రెండు పార్టులుగా తెరకెక్కుతోంది. ఇంతటి చాలెంజింగ్ రోల్‌తో మళ్లీ ఇండస్ట్రీలో అడుగుపెట్టడం ఆనందంగా ఉంది" అని అన్నారు. దర్శకుడు కార్తీక్ ఘట్టమనేని మాట్లాడుతూ "ఈ సినిమాలో మనోజ్ భాగమవ్వటం అదృష్టంగా భావిస్తున్నాను. ఆయన కమ్‌బ్యాక్ ఎంతో ఆనందాన్ని ఇస్తోంది" అని చెప్పారు. పీరియాడికల్ సూపర్ హీరో ఫాంటసీగా తెరకెక్కుతున్న 'మిరాయ్' చిత్రం వచ్చే ఏడాది ఏప్రిల్ 18న ఎనిమిది భాషల్లో 2డి, 3డి వెర్షన్స్‌లో విడుదలవుతోంది.

పాత సినిమా.. కొత్త వివాదం



పాయల్ రాజ్‌పుత్ నాలుగేళ్ల క్రితం నటించిన 'రక్షణ' చిత్రం విషయంలో మొదలైన వివాదం రోజుకో మలుపు తిరుగుతోంది. తనకు ఇవ్వాల్సిన డబ్బు చెల్లిస్తేనే సినిమా ప్రమోషన్స్‌కు వస్తానని పాయల్, ఆమె ప్రమోషన్స్‌కు వచ్చిన తర్వాతే డబ్బు ఇస్తానని దర్శకనిర్మాత ప్రణదీప్ ఠాకూర్.. అంటూ మెట్టు దిగక పోవడంతో వివాదం మరింత జటిలమైంది. ఈ విషయంలో ప్రణదీప్ ఠాకూర్ మార్చి 28న తెలుగు నిర్మాతలమండలిని ఆశ్రయించారు. 'పాయల్ రాజ్‌పుత్ మా సినిమా కోసం 50 కాల్షీట్లు ఇచ్చింది. అందులో 47 రోజులు వర్క్ చేసింది. మిగిలిన ఆ మూడు రోజులు ప్రమోషన్స్ కోసం రమ్మని అడుగుతుంటే ఆమె సహకరించడం లేదు' అని ఆయన తెలుగునిర్మాతలమండలికి ఫిర్యాదు చేశారు. పాయల్ రాజ్‌పుత్‌కు ఇవ్వాల్సిన రూ. ఆరు లక్షలు ఇవ్వడానికి తను సిద్ధమేనని ఆయన వెల్లడించారు. నిర్మాత ఫిర్యాదును తెలుగు నిర్మాతలమండలి మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్‌కు పంపించింది. అయితే ఆమె అందులో సభ్యురాలు కాకపోవడంతో తమ పరిధిలో లేని వ్యవహారమని 'మా' స్పష్టం చేయడంతో ఈ వ్యవహారాన్ని ముంబైలో ఉన్న ఫిల్మ్ ఫెడరేషన్‌కు దృష్టికి తీసుకెళ్లింది తెలుగు నిర్మాతలమండలి. ఈ లోగానే 'నాకు ఇవ్వాల్సిన డబ్బు ఇవ్వకుండా 'రక్షణ' చిత్ర నిర్మాత వేధిస్తున్నారు. తెలుగు చిత్ర పరిశ్రమ నుంచి నన్ను బ్యాన్ చేయించడానికి ప్రయత్నిస్తున్నారు' అంటూ పాయల్ రాజ్‌పుత్ రెండు రోజుల క్రితం సోషల్ మీడియా ద్వారా ఆరోపించి, వివాదాన్ని సరికొత్త మలుపు తిప్పారు. దీనిపై తెలుగు నిర్మాతలమండలి స్పందిస్తూ పాయల్‌ను బ్యాన్ చేసే ఆలోచన తమకి లేదని ఏ సమస్యనైనా శాంతియుతంగా పరిష్కరించడమే తమ ఉద్దేశమని స్పష్టం చేసింది. తెలుగు నిర్మాతలమండలి జోక్యంతో పాయల్ కొంత దారికి వచ్చిందని చెప్పాలి. ఆమె స్వరం కూడా మారింది. వివాదం పెద్దగా చేయడం ఎందుకని ఆమె అనుకున్నారో ఏమో ఈ విషయంపై వివరణ ఇస్తూ గంటల వ్యవధిలోనే మరో పోస్టింగ్ పెట్టారు. 'రక్షణ' సినిమా కోసం చిత్ర బృందం ఎంత కష్టపడ్డారో తెలుసు. ఈ సినిమాకు పనిచేసిన వారెవరికీ నష్టాలు రాకూడదనేది నా తాపత్రయం. 2020లో ఈ సినిమాకు ఎలా సపోర్ట్ చేశానో ఇప్పుడూ అంతే సహకారం అందిస్తాను. నా విన్నపం ఒకటే.. నాతో సంప్రదింపులు జరిపాకే ఈ సినిమా విషయంలో ఎటువంటి నిర్ణయమైనా తీసుకోండి. నేను ఎవరికీ హాని తలపెట్టాలని చూడటం లేదు. చిత్ర బృందం నుంచి పిలుపు కోసం.. ఈ సమస్యను పరిష్కరించడానికి నా టీమ్ ఎంతో ఆతృతగా ఎదురుచూస్తోంది" అని ఆ పోస్ట్‌లో పేర్కొన్నారు.

ఆటోతో టుక్ టుక్



చిత్ర వాహినీ, ఆర్‌వైజీ సంస్థలు నిర్మిస్తున్న 'టుక్ టుక్' పోస్టర్‌ను విడుదల చేశారు. విచిత్రమైన ఆటోతో ఈ పోస్టర్ ఆకర్షణీయంగా ఉంది. సుప్రీత్ సి.కృష్ణ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో హీరోలు హర్షరోషన్, కార్తికేయ దేవ్, స్టీవెన్ మధు ఓ ఆటో బొమ్మను ఆసక్తికరంగా చూస్తున్నారు. అసలు ఆ ఆటో బొమ్మ ఏమిటి, దానికీ, చిత్రకథకు ఉన్న సంబంధం ఏమిటి అనే అంశాలు ప్రేక్షకుల్లో ఆసక్తిని కలిగిస్తున్నాయి. సోషియో ఫాంటసీ ఇతివృత్తంతో రూపొందిన ఈ చిత్రాన్ని రాహుల్ రెడ్డి, లోక్కు, సాయివరుణ్, శ్రీరాములు రెడ్డి నిర్మించారు. ఈ సినిమాకు సంగీతం: సంతు ఓంకార్, ఫొటోగ్రఫీ: హార్దిక్ శ్రీకుమార్.

దీవిలో తుపాన్



ఇటీవల విడుదలైన 'లవ్‌గురు' చిత్రంతో విజయాన్ని అందుకొన్న తమిళ హీరో విజయ్ ఆంటోనీ తాజా చిత్రం 'తుపాన్'. విజయ్ ఆంటోనీతో ఇంతకుముందు 'రాఘవన్', 'హత్య' చిత్రాలను నిర్మించిన కమల్ బరా, డి.లలిత, బి. ప్రదీప్, పంకజ్ బోరా ఈ సినిమాకు నిర్మాతలు. పొయెటిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా దీనిని దర్శకుడు విజయ్ మిల్లర్ రూపొందిస్తున్నారు. 'ప్రస్తుతం చిత్రీకరణ తుది దశలో ఉంది. ఓ దీవి నేపథ్యంగా సాగే ఈ సినిమా షూటింగ్ అండమాన్, డయ్యూ, డామన్‌లో జరిపాం. ఈ నెల 29న టీజర్ విడుదల చేసి, త్వరలోనే చిత్రాన్ని రిలీజ్ చేస్తాం' అని నిర్మాతలు చెప్పారు.

ఘనవిజయం సాధించాలని కోరుకుంటున్నా

రచయిత విజయేంద్ర ప్రసాద్



'బేబి'తో సూపర్ హిట్ కొట్టిన తర్వాత ఆనంద్ దేవరకొండ నటించిన చిత్రం 'గం గం గణేశా'. ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్‌కు ఉదయ్ శెట్టి దర్శకత్వం వహించారు. కేదార్ సెలగంశెట్టి, వంశీ కారుమంచి నిర్మించారు. మే 31న ఈ సినిమా విడుదల కానున్న సందర్భంగా చిత్ర బృందం ప్రమోషన్స్‌ను వేగవంతం చేసింది. సోమవారం ఈ మూవీ ట్రైలర్‌ను లాంచ్ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రచయిత విజయేంద్రప్రసాద్ మాట్లాడుతూ "ఈ సినిమా ఘన విజయం సాధించాలని కోరుకుంటున్నా" అని చెప్పారు. సినిమా దర్శకుడు ఉదయ్ శెట్టి మాట్లాడుతూ "వినాయక చవితి చుట్టూ తిరిగే కథతో ఈ సినిమాని రూపొందించాం. వినోదంతో పాటు ఇందులోని ట్విస్ట్‌లు, థ్రిల్‌లు ఆకట్టుకుంటాయి" అని అన్నారు. "నేను ఇప్పటిదాకా రియలిస్టిక్ పాత్రలు పోషించాను. ఈ సినిమాలో నా పాత్ర ఫుల్ ఎనర్జిటిక్‌గా ఉంటుంది. ఇది టిపికల్ క్రైమ్ కామెడీ జానర్" అని ఆనంద్ దేవరకొండ అన్నారు. ఈ చిత్రంలో ప్రగతి శ్రీవాస్తవ, కరిష్మా, వెన్నెల కిశోర్, జబర్దస్త్ ఇమ్మాన్యుయల్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి ఎడిటర్: కార్తీక్ శ్రీనివాస్, సినిమాటోగ్రఫీ: ఆదిత్య జవ్వాడి, సంగీతం: చేతన్ భరద్వాజ్, సహ నిర్మాత: అనురాగ్ పర్వతనేని.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/XKJOAG0 లో చదవండి.

జేఎస్ఎల్ కార్మికులకు నిరాశే

● ఎటూ తేల్చని యాజమాన్యం

● ఆందోళన తీవ్రతరం చేస్తామంటున్న కార్మిక సంఘం

కొత్తవలస, మే 20: మండలంలోని అప్పన్నపాలెం పంచాయతీ జిందాల్ నగర్‌లోని జేఎస్ఎల్ కర్మాగార కార్మికులకు సోమవారం నిరాశే ఎదురైంది. లాకౌట్ విధించిన యాజమాన్యం కర్మాగారంలో పని చేస్తున్న కార్మికులకు ప్రత్యామ్నాయంగా ఉపాధి కల్పించడం కోసం చర్యలు తీసుకునేందుకు ఢిల్లీలో ఉన్న టాప్ మేనేజ్‌మెంట్‌తో మాట్లాడి సోమవారం చెబుతామంది. కానీ సోమవారం ఎదురు చూసిన కార్మికులకు ఎటువంటి సమాచారం ఇవ్వలేదు. దీంతో కార్మికులకు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు విజయనగరంలోని డీసీఎల్ వద్ద చర్చలున్నాయని సీఐటీయూ కార్మిక సంఘం నాయకుడు గాడి అప్పారావు తెలిపారు. ఈ చర్చల్లో యాజమాన్యం ఎటూ తేల్చకపోతే కార్మికులు తమ ఆందోళనను తీవ్రతరం చేస్తామన్నారు. కర్మాగారంలోని సీఐటీయూ, వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ కార్మిక సంఘం, టీడీపీ అనుబంధ సంఘం టీఎన్‌టీయూసీ కార్మిక సంఘాల కార్మికులు ఏకతాటిపై ఉంటూ సమిష్టి నిర్ణయాలు తీసుకుంటున్నామని తెలిపారు.

కార్మికులకు పెరుగుతున్న మద్దతు

జేఎస్ఎల్ కర్మాగారం గేట్‌వద్ద ఆందోళన చేస్తున్న కార్మికులకు వివిధ గ్రామాల సర్పంచ్‌లు, వివిధ పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధుల మద్దతు లభిస్తోంది. సోమవారం కొత్తవలస సర్పంచ్ మచ్చ రామస్వామి, అప్పన్నపాలెం సర్పంచ్ దేముడు, తుమ్మికాపల్లి సర్పంచ్ విరోతి కొండలరావు, ఉత్తరాపల్లి సర్పంచ్ సింగంపల్లి గణేష్, ఎంపీపీ నీలంశెట్టి గోపెమ్మ, జడ్పీటీసీ నెక్కల శ్రీదేవి, పీఏసీఎస్ అధ్యక్షుడు గొరపల్లి జయప్రకాష్ శిబిరానికి వచ్చి తమ సంఘీభావం తెలిపారు. కార్మికులు నిర్వహిస్తున్న వంటావార్పు కార్యక్రమానికి అవసరమైన బియ్యం, నిత్యావసర సరుకులను రోజుకొకరు అందిస్తున్నారు. మంగళవారం నాటి వంటావార్పు కార్యక్రమానికి శృంగవరపుకోట నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి కోళ్ల లలిత కుమారి అవసరమైన బియ్యం, నిత్యావసరాలను అందజేశారు. కార్మికులందరూ ప్రతిరోజూ నిరసన శిబిరంలోనే వంటలు చేసుకుని ఆందోళనలు నిర్వహిస్తున్నారు. కార్మిక సంఘంనాయకులు పిల్లా అప్పలరాజు, గాడి అప్పారావు, నమ్మి చినబాబు, నెక్కల నాయుడుబాబు తదితరులు పాల్గొన్నారు.



దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న ఎంపీపీ గోపెమ్మ

దారగంగమ్మ తల్లి పండగ చాటింపు



దారగంగమ్మతల్లి పండగ చాటింపునకు హాజరైన భక్తులు

శృంగవరపుకోట, మే 20: శృంగవరపుకోట పుణ్యగిరి దేవస్థానం పరిధిలోని శ్రీదారగంగమ్మ తల్లి గ్రామ దేవత పండగ చాటింపు జరిపారు. సోమవారం సాయంత్రం సాంప్రదాయం ప్రకారం అనువంశిక పూజారి మోపాడ గౌరినాయుడు ఆలయంలోని అమ్మవారి చెవిలో పండగ విదానంను చేప్పారు. ఆలయ పూజారి రాజా పంతులు వేదమంత్రాలతో పూజలు నిర్వహించారు. కళాకారులు డప్పులు కోట్టి అమ్మవారి పండగ చాటింపుకు నాందిపలికారు. ఈనెల 23 నుంచి ప్రతి రోజు ఉదయం జంగిడి, సాయంత్రం పాలఘటం, రాత్రి కూటి ఘటాలు తిరుగనున్నాయి. దీంతో తోమ్మిది రోజులు పాటు గ్రామంలో పండగ వాతావరణం నెలకొంటుంది. ఈనెల 26 ఉదయం శ్రీదారగంగమ్మ తల్లి నిజరూపదర్శనం వుంటుంది. అమ్మవారికి నీలాభిషేకం చేస్తారు. 27 రాత్రి తోలేళ్ళ, 28 రాత్రి అనుపోత్సవం వుంటుందని నిర్వాహంకులు తెలిపారు.

నేడు దాడితల్లి సిరిమానోత్సవం

● ఏర్పాట్లు పూర్తి చేసిన ఉత్సవ కమిటీ

సాలూరు రూరల్ (బొబ్బిలి), మే 20: బొబ్బిలి పరిసర 12 గ్రామాల గ్రామదేవత దాడితల్లి అమ్మవారి పండుగ సిరిమానోత్సవం ఈ నెల 21న నిర్వహణకు ఉత్సవ కమిటీ ఏర్పాట్లు చేసింది. అమ్మవారి రథమాను సిద్ధం చేశారు. ఈ పండగలో భాగంగా సోమవారం గొల్లపల్లి గ్రామంలో అమ్మవారి తోలేళ్ళ కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బండ్ల వేషాలు, కాంతార, తీన్‌మార్, బహుబలి తదితర సంబరాలను ఏర్పాటు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. క్రిష్టాపురంలో అమ్మవారి ఘటాలను ఊరేగించారు. అమ్మవారి తిరువీధి అనంతరం ఉయ్యాల కంబాల ఉత్సవం నిర్వహించారు. అమ్మవారి సిరిమానోత్సవం మంగళవారం గొల్లపల్లి నుంచి బొబ్బిలి వీధుల్లో తిప్పనున్నారు. ● పాత బొబ్బిలి గ్రామదేవత సరే పోలమ్మ అమ్మవారి రథమానోత్సవం ఈ నెల 21న నిర్వహించనున్నారు. ప్రతి రెండేళ్లకు ఒకసారి అమ్మవారి పండుగను జరపడం పాతబొబ్బిలివాసుల ఆచారం. ఈ మేరకు సోమవారం అమ్మవారికి తోలేళ్ల ఉత్సవాన్ని నిర్వహించారు. రథమానోత్సవం మంగళవారం జరపడానికి ఏర్పాట్లు పూర్తి చేశారు.



దాడితల్లి అమ్మవారు

కృష్ణాపురంలో అమ్మవారి ఘటాల ఊరేగింపు



పండ్ల బండికి నిప్పుపెట్టిన దుండగులు

● టీడీపీలో చేరాడని అక్కసు

● మంటలను అదుపుచేసిన సిబ్బంది

రాజాం: రాజాంలోని పాలకొండ రోడ్డులో కేర్ ఆసుపత్రి కూడలి వద్ద పండ్ల బండికి ఆదివారం అర్ధరాత్రి దుండగులు నిప్పంటించారు. బుచ్చింపేటకు చెందిన మహేష్ పండ్ల బండి నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు పండ్ల బండికి నిప్పుపెట్టి పరారయ్యారు. రాత్రి గస్తీ తిరుగుతున్న పోలీసులు మంటలను గమనించి అక్కడకు చేరుకుని అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం అందించారు. వారు వచ్చి మంటలను అదుపు చేశారు. అయినా బండి పూర్తిగా మంటల్లో కాలి బుడిదయ్యింది. పండ్ల బండి విలువ రూ.20 వేలు ఉంటుందని అగ్నిమాపక శాఖ అధికారులు అంచనా వేశారు. అయితే మహేష్ ఇటీవల తెలుగుదేశం పార్టీలో చేరాడు. కుటుంబ సభ్యులతో టీడీపీకి ఓటువేశానన్న అక్కసుతోనే ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టి ఉంటారని సంతకవిటి పోలీసులకు మహేష్ ఫిర్యాదు చేశాడు. ఏఎస్ఐ ముద్దూరు వాసుదేవరావు కేసునమోదు చేసి దర్యాప్తుచేస్తున్నారు.





మంటల్లో తగలబడుతున్న పండ్ల బండి, మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

అశోక్‌ను కలిసిన లలితకుమారి



అశోక్‌తో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కోళ్ల దంపతులు

విజయనగరం రూరల్/ఎస్‌కోట, మే 20: టీడీపీ సీనియర్ నేత అశోక్‌గజపతిరాజును ఎస్‌కోట కూటమి అభ్యర్థి కోళ్ల లలిత కుమారి సోమవారం మర్యాదపూర్వకంగా ఆయన నివాసంలో కలిశారు. లలితకుమారి రెండు రోజుల క్రితం తిరుపతి వేంకటేశ్వర స్వామి దర్శనానికి వెళ్లి వచ్చారు. అశోక్‌కు స్వామి వారి ప్రసాదాన్ని అందజేశారు. అనంతరం ఆమె లెండి కళాశాలలోని కౌంటింగ్ కేంద్రానికి వెళ్లి పరిశీలించి, అక్కడి నుంచి తిరిగి ఎస్.కోటకు పయనమయ్యారు.

ఖైదీలకు రుచికరమైన భోజనం పెట్టాలి



సబ్ జైలును పరిశీలిస్తున్న సాయి కల్యాణ్ చక్రవర్తి

రాజాం రూరల్, (బొబ్బిలి): ఖైదీలకు రుచికరమైన ఆహారం అందివ్వాలని జిల్లా న్యాయ సేవా సంఘం ఛైర్మన్, జిల్లా ప్రిన్సిపల్ న్యాయాధికారి సాయి కల్యాణ్ చక్రవర్తి, జిల్లా న్యాయ సేవా సంఘం కార్యదర్శి కె.విజయ కల్యాణి కోరారు. సోమవారం బొబ్బిలి సబ్ జైలును ఆకస్మికంగా తనిఖీ చేశారు. వంటగదిని పరిశీలించారు. ఖైదీలకు సరఫరా చేస్తున్న ఆహారంతో పాటు వారికి కల్పిస్తున్న సౌకర్యాలపై ఆరా తీశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేలా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని జైలు సిబ్బందికి సూచించారు.

ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన విద్య

రామభద్రపురం, మే 20: ఈ ఏడాది మండలానికి కొత్తగా మంజూరైన జూనియర్ కళాశాలలో విద్యార్థులు అధిక సంఖ్యలో చేరి... నాణ్యమైన విద్యను పొందాలని మండల విద్యాశాఖాధికారి ఆమిటి తిరుమల ప్రసాద్ సూచించారు. మండల విద్యాశాఖ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నూతన కళాశాలను ఈ ఏడాది నుంచి ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. మొదటిగా ఎంపీసీ, సీఈసీ గ్రూపులు ఏర్పాటు చేస్తున్నామని..ఒక్కొక్క గ్రూపునకు 40 సీట్లు చొప్పున ఉన్నాయని తెలిపారు.



మాట్లాడుతున్న ఎంఈవో

జగనన్నా.. ఏదీ భరోసా?

● 2.58 లక్షల రైతుల ఎదురుచూపులు

విజయనగరం (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం రైతుల పక్షపాతి అని... వారికి అండగా ఉండేందుకు వైఎస్ఆర్ రైతు భరోసా పేరిట అర్హులైన ప్రతి రైతుకు ఈ ప్రభుత్వం ఆర్థిక సాయం అందజేస్తుందని సీఎం జగన్ ప్రతిసారీ చెబుతుంటారు. ఈ ఏడాది మే నెలలో రావలసిన వైఎస్ఆర్ రైతు భరోసా డబ్బులు ఇప్పటికీ రైతుల ఖాతాల్లోకి జమ కాలేదు. జిల్లాలో రైతు భరోసా కోసం 2 లక్షల 58 వేల మంది రైతన్నలు ఆశగా ఎదురు చూస్తున్నారు. ఎన్నికల కారణంగా జమ కాలేదని వైసీపీ ప్రజా ప్రతినిధులు చెబుతున్నారు. అధికారులను అడి గితే తమకు తెలియదని... లేదా జూన్ నెలలో ఖాతాల్లోకి జమ కావచ్చని అంటున్నారు. ఖరీఫ్ పనులకు అన్నదాతలు సమాయత్తమవుతున్నారు. ఖరీఫ్ పనులు చేపడితే, డబ్బులు చేతిలో ఉండాలి. వైసీపీ ప్రభుత్వం ఏటా రూ.13,500 అందిస్తున్నట్లు ప్రచారం చేస్తోంది. కానీ కేంద్రం ద్వారా వచ్చే పీఎం కిసాన్ యోజనలో రూ.6వేలు తీసేస్తే రాష్ట్ర ప్రభుత్వం అందించేది కేవలం రూ.7500 మాత్రమే. ఈ మాత్రం సాయమైనా సకాలంలో అందించాలని రైతులు కోరుతున్నారు.

రుణాలను మంజూరు చేయాలి



ఏడీకి వినతిపత్రం అందిస్తున్న ఉపాధ్యాయ సంఘం నేతలు

విజయనగరం దాసన్నపేట, మే 20: జిల్లాలో ఏపీజీఎల్ఐసీలో ఉపాధ్యాయ, ఉద్యోగులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న రుణాలను వెంటనే మంజూ రు చేయాలని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.జోగారావు, సీహెచ్ సూరిబాబాలు కోరారు. సోమవారం ఏపీజీఎల్ఐసీ అసి స్టెంట్ డైరెక్టరును కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అకౌంట్‌లో ఉన్న మిస్సింగ్ క్రెడిట్స్‌ను సరిచేయాలని... డెత్ క్లైయిమ్‌లను పరిష్క రించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పోలీసుల అవగాహన సదస్సులు

● ప్రత్యేక కార్యక్రమాలకు అనుమతి తీసుకోవాలని సూచన

సాలూరు రూరల్: ఓట్ల లెక్కింపు వచ్చే నెల 4న జరగనుండడంతో పోలీసులు గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. ఎన్నికల అనంతర ఎటువంటి హింసాత్మక ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ జిల్లాలో సీఐలు, ఎస్ఐలను ఆదేశించారు. ఈ నేపథ్యంలో ఓట్ల లెక్కింపు అనంతరం ఫలితాలు ఆధారంగా జిల్లాలో ఏయే సర్కిల్స్‌లో ఏయే గ్రామాల్లో అలర్లు జరిగే అవకాశాలను అంచనా వేస్తున్నారు. అలర్లును ప్రేరేపించగల వ్యక్తులను గుర్తిస్తున్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కార్యాచరణ చేస్తున్నారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్ అమలు జరుగుతున్నది. ఓట్ల లెక్కింపు వరకు పట్టణాలు, గ్రామాల్లో ఎటువంటి శుభ కార్యాలను నిర్వహించినా పోలీసుల అనుమతి తీసుకోవాలని ప్రకటించారు. పాచిపెంట మండలం పణుకువలసలో ఎస్ఐ పొదిలాపు నారాయణరావు సోమవారం సాయంత్రం గ్రామంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఎన్నికల ఫలితాలు ఎలా ఉన్న గ్రామంలో సామరస్య వాతావరణం ఉండాలని సూచించారు. సాలూరు మండలంలో రూరల్ ఎస్ఐ ఎం.వెంకటరమణ అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు.



పణుకువలసలో మాట్లాడుతున్న పాచిపెంట ఎస్ఐ నారాయణరావు

30న మండల సమావేశం

వంగర: మండల సర్వసభ్యసమావేశం ఈనెల 30న నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సాల్మాన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ సురేష్ ముఖర్జి అధ్యక్షతన నిర్వహించనున్న సమావేశానికి అన్నిశాఖల అధికారులు పూర్తి సమాచారంతో హాజరు కావాలని కోరారు.

23న నేత్ర వైద్యశిబిరం

రేగిడి: మండలంలోని ఉప్పరనాయుడువలసలో ఈనెల 23న సత్యసాయిభజనమండలి ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు గ్రామ సత్య సేవాకమిటీ ప్రతినిధి కరణం రామకృష్ణ తెలిపారు. విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉదయం ఎనిమిది నుంచి మధ్యా హ్నం రెండు గంటలవరకు శిబిరం జరుగుతుందని పేర్కొ న్నారు. అర్హులైన నేత్ర రోగులకు ఉచితంగా ఆపరేషన్లు చేయడంతోపాటు, కంటి అద్దాలు సరఫరా చేయనున్నట్లు తెలిపారు.

నిధుల కొరతను అధికారుల దృష్టికి తీసుకువెళ్తా

రేగిడి: పాఠశాలల్లో నాడు-నేడు రివాల్వింగ్‌ఫండ్ నిధుల కొరత, పాఠశాల లకు అవసరమైన వస్తు సామగ్రి చేరక పోవడంపై జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తానని ఎంపీడీవో శ్యామలాకుమారి తెలిపారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నాడు-నేడు పనుల ప్రగతి, పాఠ శాల తెరిచే నాటికి శతశాతం పనుల పూర్తిపై హెచ్ఎంలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమీ క్షించారు. పాఠశాలవారీగా పనుల ప్రగతిని ఆరాతీశారు. చాలాపాఠశాలల్లో పెండింగ్ పనులు, రివాల్వింగ్ ఫండ్ కొరత, మెటీరియల్ చేరకపోవడం హెచ్ఎంలు ఎంపీడీవో దృష్టికి తెచ్చారు. నిధులు, మెటిరియల్ కొరతలేకుండా చూస్తామని, జూన్ 12 నాటికి శతశాతం పనులు చూపించాలని, పనుల్లో అలసత్వం వద్దని ఆదేశించారు. సమావేశంలో ఎంఈవోలు వరప్రసాదరావు, బి.ఎరకయ్య పాల్గొన్నారు.

ఆర్బీకేలకు చేరిన 4,370 వరి విత్తన బస్తాలు

రేగిడి: మండలంలోని 23 రైతు భరోసాకేంద్రాలకు ఈఏడాది ఖరీఫ్‌కు సంబంధించి 4370 బస్తాలు వరివిత్తన బస్తాలు చేరినట్లు ఏవో జి.మురళీకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంటీయూ 1121(శ్రీధృతి) రకం 360 బస్తాలు, స్వర్ణ రకం 770 బస్తాలు ఆయా ఆర్బీకేలకు ఇండెంట్ ప్రాప్తికి చేరినట్లు పేర్కొన్నారు. ఇంకా సాంబ, ఆర్‌జీఎల్, 1064 రకాలు రావల్సిఉందని తెలిపారు. ప్రస్తుతం కట్టెజనుము 1020 కేజీలు, జీలుగు 1200 కేజీలు అందుబాటు ఉన్నాయని, ఇవి రాయితీపై ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఈఏడాది విత్తనాలకు కొరతలేకుండా ముందుస్తు చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

సప్లిమెంటరీ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

వంగర: మద్దువలస ప్రభుత్వజూనియర్ కళాశాలలో ఈ నెల 24 నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ప్రిన్సిపాల్ కె.నారాయణరావు తెలి పారు. ఇక్కడ ఆరు రోజులు జరిగే పరీక్షలకు 898 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారని పేర్కొన్నారు. ఇప్పటికే విద్యార్థులకు హాల్‌టిక్కెట్లు అందజేసినట్లు తెలిపారు.

శిశువులను పారేయడం అమానుషం

● బాలల హక్కుల కమిషన్ ఛైర్మన్ కేసలి



మాట్లాడుతున్న కేసలి అప్పారావు

విజయనగరం దాసన్నపేట, మే 20: విజయనగరం, పార్వతీపురం-మన్యం జిల్లాల్లో ఇటీవల శిశువులను వీధి కాలువల్లో....చెత్త కుండీలలో వేస్తున్నారని.. ఇలా వారి భవి ష్యత్తును నాశనం చేయడం దుర దృష్టకరమని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ ఛైర్మన్ కేసలి అప్పారావు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం తోటపాలెంలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ఎవరికైనా పిల్లల పెంపకం, పోషణ, రక్షణ, సంరక్షణకు ఇబ్బందికర పరిస్థితి తలెత్తితే, అటువంటి శిశువులను ప్రభుత్వ నియమ నిబంధనల మేరకు తీసుకుని.. వారికి బంగారు భవిష్యత్తు కల్పిస్తామన్నారు. గర్భిణులపై అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు, సచివాలయ సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

విజయనగరం దాసన్నపేట: నగరంలోని కణపాక నవజీవన వృద్ధాశ్రయంలో సోమవారం యంగ్ టైగర్ జూనియర్ ఎన్టీఆర్ పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. సంస్థ వ్యవస్థాపకులు ఎం అప్పారావు మాట్లాడుతూ, జూనియర్ ఎన్టీఆర్ చేస్తున్న సేవా కార్యక్రమాలు చిరస్థాయిగా నిలిచిపోతాయన్నారు. ఈ సందర్భంగా వృద్ధాశ్రమంలో భోజనాలు వడ్డించారు. పైడిరాజు, సురేష్‌కుమార్, పాండ్రంకి సంతోష్‌కుమార్, అప్పారావు, రామారావు, సాయితో పాటు అభిమానులు పాల్గొన్నారు.

● జూనియర్ ఎన్టీఆర్ పుట్టిన రోజుని పురస్కరించుకుని సోమవారం కొత్త పేట, గోకుల పార్కు వద్ద జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు మజ్జిగను పంపిణీ చేశారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో ఎక్కువ మంది మజ్జిగను తీసుకు న్నారు. ఎన్టీఆర్ పుట్టిన రోజు సందర్భంగా ఏటా ఇక సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు అభిమాన సంఘం ప్రతినిధులు తెలిపారు.

● రాజాం రూరల్(బొబ్బిలి): బొబ్బిలిలో సినీ నటుడు జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలను అభిమానులు సోమవారం ఘనంగా నిర్వహించారు. నందమూరి యువసేన ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు అందజేశారు. డాక్టర్ శశిభూషణరావు ఆధ్వర్యంలో పేదలకు భోజనం ప్యాకెట్లు పంపిణీ చేశారు.

టీఏ ఇప్పించాలి

వీఆర్వోల సంఘం జిల్లా అధ్యక్షుడు అప్పలస్వామి



అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారికి వినతి పత్రం అందజేస్తున్న అప్పలస్వామి

రాజాం: ఎన్నికల విధులు నిర్వహించిన వీఆర్వోలకు టీఏ ఇప్పించేలా తగిన చర్యలు తీసుకోవాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు యజ్జల అప్పలస్వామి కోరారు.ఈ మేరకు సోమవారం రాజాం తహసీల్దార్ కార్యాలయంలో అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎస్.కృష్ణంరాజుకు వినతి పత్రం అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



సంతోష్‌కుమార్ (ఫైల్)

భోగాపురం, మే 20: రోడ్డు ప్రమాదంలో శ్రీకాకుళం జిల్లాకు చెందిన యువకుడు మృతి చెందిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. దీనికి సంబంధించి సీఐ ఎ.రవికుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీకాకుళం జిల్లా టెక్కలి మండలం మేఘవరం గ్రామానికి చెందిన లోపింటి సంతోష్ కుమార్(31) విశాఖ పోర్టులో పనిచేస్తూ కుటుంబంతో కలిసి మల్కాపురంలో నివాసముంటున్నాడు. టెక్కలిలో బంధువులు మృతి చెందడంతో వారిని పరామర్శించేందుకు ఆదివారం ఉదయం తన తల్లి లక్ష్మితో కలిసి స్కూటీపై విశాఖ నుంచి టెక్కలి బయలుదేరాడు. ఈ సమయంలో అమటాంరాయవలస సమీపంలో జాతీయరహదారిపైకి వచ్చేసరికి స్కూటీ టైర్ పంక్చర్ కావడంతో ఒక్కసారిగా బైక్ అదుపుతప్పి రోడ్డుపై పడిపోయారు. దీంతో సంతోష్‌కుమార్ తలకు బలమైన గాయం కాగా తల్లి లక్ష్మికి గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం 108లో తగరపువలస సమీప ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సంతోష్‌కుమార్ ఆదివారం రాత్రి మృతి చెందాడు. గాయాలపాలైన తల్లి లక్ష్మి ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రవికుమార్ తెలిపారు. సంతోష్‌కుమార్‌కు ఏడాది క్రితం స్వప్నతో వివాహం కాగా వీరికి 3 నెలల వయస్సు గల కుమార్తె ఉంది.

గంజాయి స్వాధీనం

తెర్లాం: గంజాయి తరలిస్తూ ఆరుగురు యువకులు పట్టుబడ్డారు. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. యువకులు ఒరి స్సాలోని సుంకి పరిసర గ్రామాల్లోని కొండ ప్రాంతాలనుంచి గంజాయిని తీసుకు వచ్చి వివిధ గ్రామాల్లో విక్రయించేందుకు తీసుకువస్తున్న ఆరుగురు యువకులను పోలీసులు పట్టుకున్నారు. ఆదివారం రాత్రి వాహన తనిఖీలు చేస్తున్న పోలీసులకు రంగప్పవలస సమీపంలో ఆరుగురు యువకులు 2.195 కేజీల గంజాయి తరలిస్తున్న పట్టుబడ్డారు. వారి వద్ద నుంచి గంజాయి స్వాధీనం చేసుకుని యువకులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్టు స్థానిక ఎస్.ఐ రమేష్ తరలించామన్నారు.

పురుగుల మందు తాగి వ్యక్తి మృతి

పాచిపెంట, మే 20 : మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. దీనికి సంబంధించి స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పాంచాళి గ్రామానికి చెందిన కలువులపల్లి రాంబాబు(44) తాగుడికి బానిసై ఇంటి పనులు, పొలం పనులు చేయకుండా తిరుగుతున్నాడు. దీంతో విసిగిపోయిన భార్య జ్యోతి తాగుడు మానేయాలని మందలించడంతో మనస్తాపానికి గురయ్యాడు. దీంతో ఈ నెల 18న ఇంటిలో ఉన్న గడ్డి మందును డాబాపైకి తీసుకువెళ్లి తాగుతుండగా భార్య చూసి వెంటనే సాలూరు ఆసుపత్రికి తీసుకువెళ్లింది. అక్కడ పరిస్థితి విషమించడంతో కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. ఈ విషయమై స్థానిక ఎస్ఐ నారాయణరావు కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నారు.

డీలర్ల వద్ద విత్తనాలు కొనుగోలు చేయండి



మాట్లాడుతున్న ఏవో వెంకటయ్య

రామభద్రపురం, మే 20: రైతులు లైసెన్సుడ్ డీలర్ల వద్ద పత్తి విత్తనాలు కొనుగోలు చేయాలని మండల వ్యవసాయాధికారి వి.వెంకటయ్య సూచించారు. మండల వ్యవసాయ శాఖ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. విత్తనాలు తీసుకున్న రైతులు విధిగా రసీదులు కూడా పొందాలని తెలిపారు. గడ్డిపిక్క పత్తి విత్తనాలు సాగుచేయడం చట్టరీత్యా నేరమని.. బీటీ-2 విత్తనాలు మాత్రమే సాగుచేయాలని సూచించారు. అలాగే ఈ ఏడాది 750 క్వింటాళ్ల వరి విత్తనాలు తెప్పించడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. 50 శాతం రాయితీపై పచ్చిరొట్ట ఎరువులు సరఫరా చేయనున్నామని తెలిపారు. సమావేశంలో వ్యవసాయ శాఖ ప్రతినిధి కొండలరావు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే చర్యలు



పెనుబాక గ్రామస్థులకు సూచనలిస్తున్న సీఐ

రాజాం రూరల్: గ్రామాల్లో శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే ఎంతటివారైనా చర్యలు తప్పవని రాజాం టౌన్ సీఐ దాడి మోహనరావు హెచ్చరించారు. సోమవారం రాత్రి మండలం లోని పెనుబాక, తదితర గ్రామాల్లో అవగాహన కార్యక మాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజకీయాలు ఎన్నికల వర కేనని, ఎన్నికలు పూర్తయ్యాక కూడా రాజకీయ కక్షలతో వివాదాలు సృష్టిస్తే కేసు లు నమోదు చేస్తామని తెలిపారు. యువత అప్రమత్తంగా ఉండాలని, క్షణికావేశా లతో భవిష్యత్తును అంధకారం చేసుకోవద్దని హితవు పలికారు. గ్రామాల పెద్దల తో చర్చించారు. కార్యక్రమంలో ఎస్ఐ రవికిరణ్ పాల్గొన్నారు.

ఎలక్షన్ డ్యూటీ పత్రాలివ్వాలి

● ఏపీటీఎఫ్ వినతి



బొబ్బిలి ఆర్డీవోకు వినతిపత్రమిస్తున్న ఏపీటీఎఫ్‌నేతలు

సాలూరు రూరల్ (బొబ్బిలి), మే 20: సార్వత్రిక ఎన్నికల్లో విధులు నిర్వహించిన ఉపాధ్యాయులు, ఉద్యోగులకు ఎలక్షన్ డ్యూటీ ధ్రువపత్రాలను అందించాలని బొబ్బిలి ఆర్డీవో సాయిశ్రీకి ఏపీటీఎఫ్(257) రాష్ట్ర అకడమిక్ కన్వీనర్ జేసీ రాజు, ఏపీటీఎఫ్ నేతలు సింగారపు ఎల్లయ్య, ప్రవీణ్ తదితరులు సోమవారం వినతి పత్రమందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలో ఎన్నికల నిర్వహణకు ఉపాధ్యాయులు, ఉద్యోగులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారన్నారు. పీవో, ఏపీవోలకు మూడు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారన్నారు. ఎన్నికల నిర్వహణకు ఈ నెల 12, 13 తేదీల్లో నిద్రాహారాలు మాని విధులు నిర్వహించారన్నారు. ఈవీఎంలు అప్పగించడానికి పీవో, ఏపీవోలు ఈ నెల 14న వరకు కలెక్షన్ సెంటర్‌లో ఉన్నారన్నారు. ఎన్నికల కమిషన్ ఈ నెల 14న ఆన్‌డ్యూటీగానే పరిగణించిందన్నారు. వీటి అన్నింటిని పరిగణనలోకి తీసుకొని ఎన్నికల విధులు నిర్వహించిన వారికి ఎలక్షన్ డ్యూటీ ధ్రువపత్రాలు ఆయా ఆర్వోలు పీడీఎఫ్ రూపంలోనైనా పంపించాలని కోరారు.

నిధులు లేక.. మరమ్మతుకు నోచుకోక

● ఇదీ వీరఘట్టంలోని ఒట్టిగెడ్డపై వంతెన పరిస్థితి

వీరఘట్టం: వీరఘట్టంలోని ఒట్టిగెడ్డపై నిర్మించిన వంతెన నిధులు లేక మరమ్మతులకు నోచుకోవడం లేదు. ఏళ్ల తరబడి మరమ్మతులు లేకపోవడంతో రెయిలింగ్ పూర్తిగా దెబ్బతింది. దీంతో చిన్నపాటి వర్షం కురిసినా వంతెనపైన నీళ్ల నిల్వ ఉంటున్నాయి. పార్వతీపురం, శ్రీకాకుళం ప్రధానరహదారి కావడంతో నిత్యం వందలాది వాహనాలు ఈ వంతెనపై నుంచి వెళ్తుంటాయి. నీరు నిల్వఉండడంతో ప్రయాణికులు, వాహన చోద కులు అగచాట్లకు గురవుతున్నారు. వంతెనకు ఇరువైపులా ఉన్న రక్షణ గోడలు కూడా పాడయ్యాయి. 1990లో వంతెన పునర్నిర్మాణం చేసి ప్రారంభించారు. సుమారు 34 సంవత్సరాలు కావస్తున్నా అధికారులు వంతెన మరమ్మతులపై దృష్టిసారించడంలేదని పలువురు వాహన చోదకులు వాపోతున్నారు. కాగా వంతెన మరమ్మతులకోసం ప్రతిపాదనలు ఉన్నతాధికారులకు పంపించామని ఆర్అండ్బీ జేఈ జగన్మోహన్‌రాజు తెలిపారు. నిధులు మంజూరైన వెంటనే మరమ్మతులు చేపడతామని చెప్పారు.


వంతెనపై నిల్వ ఉన్న నీరు


బ్రిడ్జిపై రక్షణ గోడ దెబ్బతిన్న దృశ్యం

ఘనంగా శ్రీవారి ఆలయ వార్షికోత్సవం


శ్రీవారి కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

సీతంపేట: సీతంపేటలో తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేంకటేశ్వర ఆలయంలో సోమవారం శ్రీవారి ప్రథమ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీవారి కల్యాణ మహోత్సవానికి జిల్లా నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ సిబ్బంది అన్ని ఏర్పాట్లుచేశారు.శ్రీవారి సేవకులు కోలాటం చేస్తూ భక్తులకు కను విందు చేశారు. అనంతరం ఆలయ ఆవరణలో ఉచిత అన్నదాన కార్యక్రమం నిర్వ హించారు. కార్యక్రమంలో దేవస్థానానికి చెందిన ఎగ్జిక్యూటివ్ ఈవో జగన్మోహన్ చార్యులు, తిరుమల తిరుపతి దేవస్థానానికి చెందిన అర్చకులు సాయిస్వామి, సీతంపేట ఆలయ ఇన్‌స్పెక్టర్ రాంబాబు, గోవిందప్ప, రెడ్డప్ప పాల్గొన్నారు.

వైభవంగా సత్యనారాయణ స్వామి కల్యాణం

భామిని: మండలంలోని సొలికిరిలో సత్యనారాయణ స్వామి ఆలయంలో కల్యాణం ఆదివారం రాత్రి అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు వినయ్‌శర్మ ఆధ్వర్యంలో వేదమంత్రాలతో భూదేవి, శ్రీదేవి సమేత సత్య నారాయణస్వామి కల్యాణం చేశారు. ఆలయకమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి భక్తులు భారీగా తరలివచ్చారు. కాగా దీపారాధన చేపట్టారు.


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

తాగునీటి సమస్యను ఎప్పుడు పరిష్కరిస్తారు?

● సీపీఎం పట్టణ కార్యదర్శి జీవీ రమణ


రంగుమారిన తాగునీటిని డీఈ కిరణ్‌కు చూపిస్తున్న సీపీఎం నాయకులు

పార్వతీపురం టౌన్: గత కొన్ని రోజులుగా పార్వతీపురం మున్సిపాల్టీలో రంగుమారిన తాగునీరు సరఫరా అవుతున్నా కనీసం అధికారులు పట్టించుకోవడం లేదని సీపీఎం పట్టణ కార్యదర్శి జీవీ రమణ, నాయకుడు బి.సూరిబాబు ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద వారి ఆధ్వర్యంలో పలువురు నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గత పదేళ్లుగా తాగునీటి సరఫరా అధ్వాన్నంగా ఉందని, ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోకపోవడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సమస్యను పరిష్కరించాలని డీఈ కిరణ్‌కుమార్‌ను కోరారు.

దివ్యాంగ విద్యార్థులపై సర్వే

గరుగుబిల్లి: మండలంలో దివ్యాంగులను పాఠశాలల్లో చేర్పించేందుకు ప్రత్యేక సర్వేను నిర్వహిస్తున్నామని ఐఈఆర్పీ వీర్రాజు తెలిపారు. మండలంలోని రావుపల్లి, గొట్టివలసతో పాటు పలు గ్రామాల్లో సోమవారం ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా అధికారుల ఆదేశాల మేరకు 0 నుంచి 18 ఏళ్ల వయస్సుగల దివ్యాంగులను గుర్తిస్తున్నామని చెప్పారు. మండల కేంద్రంలో దివ్యాంగులకు అర్థమయ్యే రీతిలో ప్రత్యేక పాఠశాలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాలతో పాటు సచివాలయ ఉద్యోగులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. సర్వేలో ప్రస్తుతానికి ఆరుగురిని గుర్తించామని, ఈ సర్వే జూన్ 8వ తేదీ వరకు నిర్వహిస్తామని చెప్పారు. ఈ సర్వేలో సిబ్బంది విజయలలిత, తదితరులు ఉన్నారు.


రావుపల్లిలో సర్వే నిర్వహిస్తున్న సిబ్బంది

సేంద్రియ పద్ధతిలో కూరగాయల సాగు

కురుపాం రూరల్: కురుపాం మండలంలో గత కొన్ని సంవత్సరాలుగా సేంద్రియ పద్ధతిలో కూరగాయలను సాగు చేస్తున్నారు. ఎటువంటి రసాయనిక ఎరువులు, పురుగు మందులు వేయకుండా సాగు చేయడంతో ప్రజలు సేంద్రియ పద్ధతిలో సాగు చేసిన కూరగాయలను కొనేందుకు ఎగబడుతున్నారు. ప్రతి గురువారం కురుపాంలో వారపు సంత జరుగుతుంది. ఏజన్సీలో పండుతున్న కూరగాయలను గిరిజనులు కురుపాంమార్కెట్‌కు తీసుకువచ్చి అమ్ముతున్నారు.వీటిని కొనేందుకు సుదూరప్రాంతాల నుంచి వర్తకులు వస్తున్నారు.కంద రకాలతో పాటు, జొన్నపొత్తులు, బీర, కాకర, వంగ, ఆనప, చిక్కుడు వంటి కూరగాయలతో పాటు నారింజ, నిమ్మ, కమల, మామిడి వంటి పళ్ల రకాలు కూడా మార్కెట్‌కు వస్తున్నాయి. కురుపాం మార్కెట్‌లో లభించే కూరగాయల కంటే సేంద్రియ కూరగాయలు తక్కువ ధరకు లభిస్తుండటంతో పాటు ఆరోగ్యం, ఇటు డబ్బు ఆదా అనే దృక్పదంతో పలువులు సేంద్రియ పలసాయాల వైపు మొగ్గుచూపుతున్నారు.


కురుపాం మార్కెట్‌కు సేంద్రియ కంద రకాలు తీసుకొస్తున్న మహిళలు

బిల్లులు చెల్లించక.. పనులు సాగక

● ఇదీ మక్కువ-చినబోగిలి రహదారి పరిస్థితి

మక్కువ: మక్కువ నుంచి చినబోగి వరకు రహదారి పనులకు సంబంధించి బిల్లులు చెల్లించకపోవడంతో పనులు ముందుకు సాగడం లేదు. మక్కువ నుంచి చినబోగిలి వెళ్లేందుకు 15 కిలోమీటర్ల దూరం గత ఏడాది ఏప్రిల్‌లో సుమారు 30 కోట్ల అంచనాతో పనులు ప్రారంభించారు. తొలుత మక్కువ నుంచి చినబోగిలి వెళ్లే ప్రధానరహదారి నిర్మాణంలో భాగంగా రోడ్డుకు ఇరువైపులా పిచ్చిమొక్కలు తొలగించారు.అడ్డంగా ఉన్న విద్యుత్ స్తంభాలను పక్కనపెట్టారు. రహదారిపైకి హద్దు దాటి అక్రమంగా నిర్మించిన ఇళ్లను సైతంతొలగించారు.దీంతో రోడ్డు నిర్మాణం పూర్తవుతుందని, సాఫీగా ప్రయాణించవచ్చని వాహనచోదకులు భావించారు. కాంట్రాక్టర్ జరిపిన ఐదు కోట్ల విలువైన పనులకు బిల్లులు చెల్లించకపోవడంతో రోడ్డు నిర్మాణం మధ్యలోనే ఆపేశారు. మక్కువ నుంచి జిల్లా కేంద్రానికి చేరుకొనే ఈ ప్రధాన మార్గం గోతులమయంగా మారడంతో వాహనచోదకులు అవస్థలకు గురవుతున్నారు. రాళ్లు తేలడంతో టైర్లు పంచర్లు అవుతున్నాయని పలువురు వాపోతున్నారు. వర్షం కురిస్తే గోతుల్లో నీరుచేరడంతో ఇబ్బందులకు గురవుతున్నారు.ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారి పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని చోదకులు కోరుతున్నారు.


రాళ్లు తేలిన మక్కువ-చినబోగిలి ప్రధాన రహదారి

కార్యకర్తగా పనిచేస్తా

పార్వతీపురంటౌన్: తాను నమ్ముకున్న పార్టీకి కార్యకర్తగా పనిచేసి బీజేపీ సిద్ధాంతాలకు కట్టుబడి ఉంటానే తప్పా ఎటువంటి పరిస్థితుల్లో తప్పు చేయనని ఆ పార్టీ రాష్ట్ర మీడియా ఇన్‌చార్జి ఎస్.ఉమామహేశ్వరరావు స్పష్టం చేశారు. సోమవారం ఆయన పట్టణంలో స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ఎన్నికలకు ముందు తన కుమారుడి చదువు, భార్య అనారోగ్యం రీత్యా విశాఖపట్నం, పార్వతీపురం వెళ్లి వస్తుండడం వల్ల బీజేపీ జిల్లా అధ్యక్షుడు డి.శ్రీనివాసరావు తనపై పార్టీ పరంగా ఆరోపణలు చేస్తుండడం బాధాకరమన్నారు. అరకు పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి అనుకూలంగా పనిచేయలేదని ఆరోపించారన్నారు. ఇటీవల పార్టీ నుంచి తనను సస్పెండ్ చేసినట్టు ఆయన చెప్పడం సరికాదన్నారు. తనపై వ్యక్తిగతంగా విమర్శలు చేస్తున్న శ్రీనివాసరావుపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర హైకమాండ్‌కు ఫిర్యాదు చేస్తానని చెప్పారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

మక్కువ: ఎన్నికల కోడ్, 144 సెక్షన్ అమల్లో ఉండడంతో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని ఎస్ఐ పి.నరసింహమూర్తి హెచ్చరించారు. సోమవారం మక్కువలో విలేకరులతో మాట్లాడుతూ గ్రామాల్లో నిర్వహిస్తున్న జాతర్లలో డీజేలు, మైకొసెట్లు వినియోగించరాదని, పేకాట శిబిరాలు ఏర్పాటుచేయవద్దని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా వ్యవహరిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలకు వెనుకాడబోమని హెచ్చరించారు. గ్రామాల్లో శాంతియుత వాతావరణం నెలకొనేలా పోలీసులకు సహకరించాలని కోరారు.

పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ


రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న రాబర్ట్‌పాల్

బలిజిపేట: బర్లి రైతుభరోసా కేంద్రపరిధిలో జిల్లా వ్యవసాయాధికారి కె.రాబర్ట్‌పాల్ సమక్షంలో సోమవారం పచ్చిరొట్ట విత్తనాలు, జీలుగులు రైతులకు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బలిజిపేట మండలంలో 97.30 క్వింటాళ్ల జీలుగులు, 0.9 క్వింటాళ్ల కట్టిజనుము, 0.4 క్వింటాళ్ల పిల్లిపెసర విత్తనాలు ముందుగా రైతుభరోసా కేంద్రాల్లో నిల్వ ఉంచామని ఆయన చెప్పారు. పచ్చిరొట్ట విత్తనాల వల్ల భూసారం పెరుగుతుందన్నారు. 10 కిలోల జీలుగ విత్తనాల ప్యాకెట్ ఖరీదు రూ.880 కాగా, రాయితీ రూ.440 పోనూ రైతు చెల్లించాల్సింది రూ.440 అని చెప్పారు. 10 కిలోల కట్టి జనుము విత్తనాలు రూ.880 కాగా, రాయితీ రూ.440 పోనూ రైతు కట్టాల్సింది రూ.440. పిల్లిపెసర 8 కిలోల ప్యాకెట్ రూ.1,072 కాగా, రాయితీ రూ.536, రైతు చెల్లించాల్సింది రూ.536 రూపాయలు. ఈ రాయితీని రైతులు వినియోగించుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శ్రావణ్‌కుమార్ నాయుడు, గ్రామ వ్యవసాయ సహాయకురాలు వేదుల చాందిని పాల్గొన్నారు.

● **సీతానగరం:** మండలంలోని గుచ్చిమి రైతు భరోసా కేంద్రంలో జిల్లా వ్యవసాయాధికారి కె.రాబర్ట్‌పాల్ చేతులమీదుగా సోమవారం రైతులకు పచ్చిరొట్ట విత్తనాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్వతీపురం సహాయ వ్యవసాయ సంచాలకుడు టి.వెంకటేష్, మండల వ్యవసాయాధికారి అవినాష్, గ్రామ వ్యవసాయ సహాయకుడు ప్రణీత్, రైతులు పాల్గొన్నారు

డ్రాయింగ్‌పై విద్యార్థులకు అవగాహన

పాలకొండ: పాలకొండలోని గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా డ్రాయింగ్ మాస్టార్ జి.మురళి ఆధ్వర్యంలో డ్రాయింగ్‌పై సోమవారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి బబ్బురు గణేష్‌బాబు, సహాయకుడు ఈశ్వర్, గ్రంథాలయ పాఠకులు పాల్గొన్నారు.

113 సర్వీస్ ఓట్లు రాక

● సాలూరు నియోజకవర్గంలో మూడో తేదీ వరకు స్వీకరణ

సాలూరు రూరల్: సాలూరు నియోజకవర్గానికి సంబంధించి 113 సర్వీస్ ఓట్లు సోమవారం నాటికి సాలూరు ఆర్వో కార్యాలయానికి చేరాయి. సైనిక దళాల్లో పనిచేసిన వారికి కేటగిరి సర్వీస్ ఓటు (సీఎస్‌వీ) మంజూరు చేశారు. వారు తమ ఓటును ఎలక్ట్రానిక్ పద్ధతిలో గానీ పోస్టల్ ద్వారా గానీ ఆర్వో కార్యాలయానికి ఓట్ల లెక్కింపు తేదీ ముందు రోజు వరకు పంపించే అవకాశముంది. సాలూరు నియోజకవర్గంలో 385 సీఎస్‌వీ ఓట్లు జారీ చేశారు. వాటిలో ఇప్పటివరకు 113 వచ్చాయని ఎన్నికల డీటీ రాజశేఖర్ తెలిపారు. వచ్చే నెల 3 నాటికి మిగిలిన ఓట్లు వచ్చే అవకాశం ఉందన్నారు. ఇప్పటివరకు వచ్చిన ఓట్ల వివరాలను రికార్డుల్లో నమోదు చేశారు. వాటిని నిబంధనల ప్రకారం భద్రపర్చారు.


సీఎస్‌వీ ఓట్ల వివరాలు నమోదు చేస్తున్న ఎన్నికల డీటీ రాజశేఖర్

వ్యాధులపై అవగాహన

సీతానగరం: మండల పశు వైద్య కార్యాలయంలో మండల పశువైద్యాధికారి ఎస్.రామారావు సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న సీజన్‌లో గొర్రెలు, మేకలు, పశువుల్లో సాధారణంగా వచ్చే వ్యాధులపై అవగాహన కల్పించి, వాటిని అరికట్టేందుకు టీకాలపై వివరించారు. ఈనెలలో 1,620 పెద్ద పశువులకు జబ్బవాపు నివారణ టీకాలు, అలాగే 12,500 గొర్రెలకు చిటిక వ్యాధి నివారణ టీకాలు వేశామని చెప్పారు. ఈ సమీక్షా సమావేశంలో సిబ్బంది పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవు

● చీపురుపల్లి డీఎస్పీ చక్రవర్తి

చీపురుపల్లి: శాంతి భద్రతలకు విఘాతం కలిగించేవారు ఎంతటి వారైనా చర్యలు తప్పవని చీపురుపల్లి డీఎస్పీ ఏఎస్ చక్రవర్తి హెచ్చరించారు. చీపురుపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఆయన సోమవారం జి.ములగాం గ్రామస్థులు, పెద్దలతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నపాటి తగాదాల కారణంగా గ్రామంలో ఉన్న సుహృద్భావ వాతావరణానికి విఘాతం కలుగుతుంద న్నారు. నాయకులు, ప్రజలు సంయమనంతో మెలగాలని ఆయన కోరారు. ఓట్ల లెక్కింపు సమయంలో శాంతి భద్రతలకు ఎటువంటి విఘాతం కలగకుండా అందరూ తమ వంతు సహకారం అందించాలని డీఎస్పీ కోరారు. అనంతరం, ఇటీవల ఘర్షణకు బాధ్యులైన వారిపై బైండోవర్ కేసులు నమోదు చేశారు. ఈ సమావేశంలో సీఐ సీహెచ్.శ్యామలరావు, ఎస్ఐ కె.కిరణ్‌కుమార్‌నాయుడు, ఇరువర్గాల నాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీఎస్పీ చక్రవర్తి

ఉపాధి పనుల పరిశీలన

దత్తిరాజేరు: మండలంలోని భోపాలరాజపురం, పోరళి గ్రామాల్లో నిర్వహిస్తున్న ఉపాధిహామీ పనులను ఏపీడీ జనార్దన్ సోమవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్దేశించిన కొలతల ప్రకారం పనులు చేయాలన్నారు. గరిష్ఠ వేతనం పొందేందుకు ప్రతిఒక్కరూ ప్రయత్నించాలని సూచించారు. కూలీల సంఖ్య పెంచాలని, పనుల వద్ద టెంట్లు, ప్రథమ చికిత్స కిట్లు, నీటి సదుపాయం కల్పించాలని ఉపాధి సిబ్బందికి ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో వెంకటప్పలనాయుడు, క్షేత్ర సహాయకులు, వేతనదారులు పాల్గొన్నారు.

నేడు పవర్ కట్

జియ్యమ్మవలస: జియ్యమ్మవలస, కురుపాం, గుమ్మలక్ష్మీపురం మండలాల్లో మంగళవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్‌శాఖ ఈఈ వీవీ కిషోర్ తెలిపారు. నాగూరు ఫీడర్ వద్ద విద్యుత్ లోడు కాయడం లేదన్నారు. అందుకే ఆ ఫీడర్‌లో డబుల్ పవర్ తో కూడిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడంతో పాటు మరికొన్ని చోట్ల మరమ్మతులు చేయాల్సి ఉందని చెప్పారు.

కుందిలి సంతకు పనస

సాలూరు రూరల్: ఏవోబీ అడవుల్లో పనస చెట్లు విరగ్గాశాయి. ఏవోబీ అడవుల్లో ఉన్న పనస చెట్లు అధికంగా కాపుకాయడంతో గిరిజనులకు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ పనస కాయలను సేకరించి గిరిజనులు ఒడిశాలో కుందిలి సంతలో విక్రయిస్తున్నారు.పనసతో గిరిజనులు ఆదాయం లభిస్తుండడంతోవారి అవసరాలు తీరుతున్నాయి.సంతలో ఒక్కొక్క కాయ రూ.35 నుంచి 50 వరకు విక్రయిస్తున్నారు.


మోనంగి వద్ద విరగ్గాసిన పనస చెట్టు

భామినిలో వర్షం


భామినిలో వర్షం కురుస్తున్న దృశ్యం

భామిని: భామినిలో సోమవారం సాయం త్రం వర్షం కురిసింది. ఇక్కడ ఐదు రోజులుగా సాయంత్రం ఉరుములు, మెరుపులతో వర్షం కురుస్తున్న విషయం విదితమే. ఈవర్షం దుక్కులకు అనుకూలంగా ఉంటుందని రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం ఖరీఫ్‌కోసం దుక్కులు చేపట్టారు. కాగా ఉక్కపోతతో అల్లాడిపోతున్న ప్రజలకు వర్షం ఉపశమనం కలిగించింది. వర్షం కురవడంతో సాయంత్రం ఆరు గంటలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

స్తంభాల పునరుద్ధరణ

వీరఘట్టం: వీరఘట్టంలో ఆదివారం సాయంత్రం వీచిన ఈదురుగాలులకు విద్యుత్ స్తంభాలు నేల కొరిగాయి. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. ఏఈ బాలాజీ, విద్యుత్ సిబ్బంది సోమవారం స్తంభాలను పునరుద్ధరించారు.

గ్రంథాలయ సేవలను వినియోగించుకోండి

గరుగుబిల్లి: శాఖా గ్రంథాలయాల సేవలను సద్వినియోగం చేసుకోవాలని మండల నిర్వాహకుడు నల్ల మధుసూదనరావు కోరారు. వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా గ్రంథాలయంలో సోమవారం పుస్తక పఠనం, క్విజ్ పోటీలు, స్వాతంత్ర్య సమరయోధుల జీవిత చరిత్రతో పాటు పలు అంశాలపై అవగాహన కల్పించారు.


అవగాహన కల్పిస్తున్న మధుసూదనరావు

శిథిలావస్థలో ఏవో కార్యాలయం

● మార్కెట్‌యార్డులోని తాత్కాలిక రేకులషెడ్‌లో కార్యకలాపాలు

వీరఘట్టం: వీరఘట్టంలోని వ్యవసాయ శాఖ కార్యాలయం(ఏవో) శిథిలావస్థకు చేరడంతో సిబ్బంది తాత్కాలికంగా మార్కెట్‌యార్డ్‌లో రేకులషెడ్‌లో ఏర్పాటు చేసిన ఆర్బీకేలో విధులు నిర్వహిస్తున్నారు. వీరఘట్టంలో మూడు రైతు భరోసా కేంద్రాలు మంజూరు కాగా, రెండు శ్లాబు దశలో ఉండగా, ఒకటి పునాది దశలో ఉంది. అలాగే మండలానికి మొత్తం 23 రైతు భరోసా కేంద్రాలు మంజూరు కాగా, కిమ్మి, తూడి, కంబర, హుస్సేన్‌పురం, కత్తులకవిటి, బిటివాడ గ్రామాల్లోని మాత్రమే నిర్మాణాలు పూర్తయ్యాయి. మిగిలిన గ్రామాల్లో వివిధ దశల్లో ఉన్నాయి. ప్రస్తుతం వీరఘట్టం వ్యవసాయశాఖ కార్యాలయం మార్కెట్ యార్డులోని రైతు భరోసా కేంద్రంలో నడుస్తోంది. మండల వ్యవసాయ శాఖ అధికారి ఇక్కడే విధులు నిర్వహిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మండల వ్యవసాయశాఖ సొంత భవనాన్ని నిర్మించాలని పలువురు కోరుతున్నారు. వీరఘట్టం మేజర్ పంచాయతీలో నాలుగు రైతు భరోసా కేం ద్రాలు మంజూరైనప్పటికీ ఒక్కటి కూడా పూర్తికాలేదు. వ్యవసాయ శాఖ కార్యాలయానికి పూర్తిస్థాయి భవనం లేకపోవడంతో పలు పనులపై వచ్చే రైతులు అగచాట్లకు గురవుతున్నారు. దీనికితోడు రాయితీపై వచ్చే విత్తనాలు, పరికరాలు నిల్వ చేసుకోవడానికి సైతం ఇబ్బందులు తప్పడంలేదు. వ్యవసాయశాఖ కార్యాలయం దుస్థితిని పలుసార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేకుండాపోయిందని రైతులు వాపోతున్నారు.


శిథిలావస్థకు చేరిన వ్యవసాయ శాఖ కార్యాలయ భవనం

మద్యం అక్రమ అమ్మకాలపై తెలియజేయండి: ఎస్ఐ పాపారావు


అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ పాపారావు

బలిజిపేట: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ వి.పాపారావు గ్రామ మహిళా పోలీసులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో అక్రమంగా మద్యం అమ్మకాలకు పాల్పడితే వెంటనే పోలీస్‌స్టేషన్‌కు తెలియజేయాలన్నారు. అలాగే వాటర్ బాటిల్స్‌లో, ఆయిల్ క్యాన్‌తో పెట్రోల్, డీజిల్ తరలించినా తగుచర్యలు తప్పవన్నారు. ఈ విషయాన్ని ముందస్తుగా గ్రామాల్లో వ్యాపారులకు తెలియజేయాలని ఆయన మహిళా పోలీసులకు సూచించారు. అలాగే 144 సెక్షన్ అమల్లో ఉన్నందున జూన్ 6వ తేదీ వరకు ఎటువంటి తగాదాలకు పాల్పడకూడదని, మందుగుండు సామగ్రిని కాల్చడానికి అనుమతి లేదని ఆయన తెలిపారు.